విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 27 సెప్టెంబరు 2024 8 పేజీలు

గ్రీన్ ట్యాక్స్ భారం

- కట్టలేకపోతున్న వాహనదారులు
- జీవో నెంబర్ 21 రద్దు చేయాలని డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 21 వాహనదారులకు భారంగా మారింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిని రద్దు చేస్తామని చెప్పి ఇంతవరకు అమలుపరచలేదు. వాహనదారులకు ఒకపక్క డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగి ఇప్పటికే మనుగడ కష్టంగా మారింది. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా గత ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెంబర్ 21 ప్రకారం అధిక పన్నుల వసూలు వల్ల వారి మనుగడ మరింత కష్టంగా మారింది. అధికారిక లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ ఆదాయం 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలలో 39.15 శాతం పెరిగింది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో రూ.2,130 కోట్లు వసూలైంది. అంతకుముందు సంవత్సరం అదే కాలానికి వస్తువులైన పన్నుల మొత్తం కేవలం రూ.1,531 కోట్లు మాత్రమే. వాహనాల మీద ఏ మోతాదులో పన్నుల భారం పెరిగిందో ఈ తేడాను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆ పన్నులలో కేవలం లైఫ్ టైం టాక్స్ ద్వారానే 38.88 శాతం మేర ఆదాయం పెరిగింది. అది 2022-23 ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలలలో రూ.1,215.51 కోట్లకు చేరింది. అదే కాలంలో అంతకుముందు ఏడాది కేవలం రూ.875 కోట్లు మాత్రమే వసూలు అయింది. 2006 నాటి పన్నులను సవరించి కొత్త చట్టం అమలులోకి రావడంతో వాహనాలపై దాదాపు అన్ని పన్నులు పెరిగాయి. దానికి తగ్గట్టుగానే రవాణా శాఖ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. అదే సమయంలో వాహనదారులకు ఇది భారంగా మారింది.

నూతన చట్టం ప్రకారం....

ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ రూపొందించిన ఏపీ మోటారు వెహికల్ టాక్సేషన్ సవరణ బిల్లు-2021కు ఆ ఏడాది నవంబర్ 24న అసెంబ్లీలో ఆమోదం దక్కింది.ఆ తర్వాత వాహనాల మీద పన్నులు సవరించారు. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం దేశంలో 5-6 శాతం వాహనాల నుంచే 65 శాతం వరకు కాలుష్య కారకాలు వెలువడుతుండడంతో వాటిని నియంత్రించడానికి,పాత వాహనాలను అదుపు చేసే చర్యలలో భాగంగా గ్రీన్ టాక్స్ పెంపుదల చేస్తున్నట్లు ఆ బిల్లులో పేర్కొన్నారు. దాన్ని అనుసరించి వివిధ పనులు పెంచారు. వాటిలో లైఫ్ టైం టాక్స్,షార్ట్ టైం టాక్స్,క్వార్టర్లీ టాక్స్,గ్రీన్ టాక్స్,బోర్డర్ టాక్స్, కాంపోజిట్ టాక్స్ వంటివి ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పన్నులు మిగతా 2లో..

పోషకాహారంతో ఆరోగ్యవంతమైన శిశువులు

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - రామచంద్రపురం : ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణీలు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. గురువారం రామచంద్రపురం పట్టణం లైన్స్ క్లబ్ కళ్యాణమండపంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మొదటగా రామచంద్రపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యూట్రిషన్ స్టాల్స్ లో ప్రదర్శనకు ఉంచిన పౌష్టికాహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణీలు ప్రతిరోజు పౌష్టికాహారాన్ని మిగతా 2లో..

మెరుగైన ఉపాధి కల్పనకు కృషి

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల లబ్ధిదారులకు మెరుగైన ఉపాధి అవకాశాలను అందించడంలో సాంకేతికత, సౌర విద్యుత్‌ను వినియోగించేందుకు అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మంది రంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగుదలకు కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్మెంట్ అండ్ వాటర్, న్యూఢిల్లీ (సిఇఇడబ్ల్యు) ప్రతినిధులు, డి ఆర్ డి ఎ, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాలలో సాంకేతికత, సౌర విద్యుత్ జోడించి ఆయా రంగాలలో ఉపాధి పొందుతున్న లబ్ధిదారులకు తక్కువ ఖర్చుతో, ఎక్కువ లాభాన్ని చేకూర్చే ఉపాధి అవకాశాలను జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలన్నారు. వరి సాగు, డైరీ, డ్రై ఫిష్ , కోకోవా వంటి వాటికి సాంకేతికతను, సౌర విద్యుత్ పరికరాలతో చేపట్టడానికి ప్రయోగాత్మకంగా పరిశోధనలను చేపట్టాలన్నారు. పాడి రైతు పశువులకు దాణ, తౌడు, ఉలవలు వినియోగం ఖర్చును తగ్గించేం దుకు, మొక్కజొన్న గింజలు ద్వారా మిగతా 2లో..

వసతి గృహ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ కోశాధికారి సాయికుమార్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండలం కొవ్వలి ఎస్.సి. బాలుర వసతి గృహ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వసతి గృహాల సమస్యలపై జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి,ఎస్.పి.ప్రతాప్ కిషోర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.అనంతరం సాయికుమార్ మీడియాతో మాట్లాడుతూ కొవ్వలి ఎస్.సి. బాలుర వసతి గృహంలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు త్రాగడానికి కనీసం పరిశుభ్రమైన త్రాగునీరు కూడా అందించడం లేదని విమర్శించారు. కలుషిత నీటితో విద్యార్థులు తీవ్ర జ్వరాలతో వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నా అధికారులకు చీమకుట్టినట్లైనా లేదని మండిపడ్డారు. విద్యార్థులు విశ్రాంతి తీసుకునే మిగతా 2లో..

కౌలు రుణాల మంజూరులో ప్రత్యేక విధానం

- కౌలు రైతులకు వ్యవసాయాధికారులచే గుర్తింపు కార్డులు జారీ
- గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో కౌలు రైతులకు పంట రుణాలు అందించడంలో మరింత మేలు జరిగేలా ప్రత్యేక విధానాన్ని తీసుకువస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో గురువారం బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొన్న అనంతరం పాత్రి కేయులతో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో 80 శాతానికి పైగా కౌలు రైతులు సాగు చేస్తున్నారని, అయినప్పటికీ వార్షిక రుణ ప్రణాళికలో ప్రాధాన్యతా రంగాలకు రూ. 16 వేల కోట్ల రుణాలు లక్ష్యంగానూ, కౌలు రైతులకు అందులో కేవలం మిగతా 2లో..

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తులో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వివి ప్యాట్‌లను భద్రపరిచిన గోదామును కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం గోదామును తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న అన్ని చర్యలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-లింగపాలెం: అసంపూర్తిగా ఉన్న ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని లింగపాలెం మండల ప్రత్యేక అధికారి జయప్రకాష్ గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్, అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమంలో భాగంగా

మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక అధికారి పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాణి, గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రేమ్ చైతన్య, పంచాయతీరాజ్ విస్తరణాధికారి రత్నకుమార్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ జగన్నాధ రావుపాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో పలు విషయాలు వెల్లడించారు. 2021-2024 సంవత్సరకాలంలో మండలానికి 2,915 ఇళ్లమంజూరు అయ్యాయని వీటిలో సొంత స్థలాలు ఉన్నవారికి1022 ఇళ్లమంజూరు చేయగా వీటిలో904 పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పీఎంఏవై పథకంలో 1027ఇళ్లకు128 ఇళ్ళుమాత్రమే పూర్తయ్యాయని,అదే విధంగా866ఇళ్లను లేఅవుట్ ద్వారా మంజూరు చేస్తే వీటిలో150 మాత్రమే పూర్తి చేశారని వివరించారు. మంజూరైన ఇళ్లల్లో పునాదుల స్థాయిలో 259ఇళ్లుఉండగా, స్లాబ్ దశలో ఉన్నవి46 మాత్రమేనని తెలిపారు.ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ 2025 మార్చి చివర నాటికి పూర్తి చేసుకోకపోతే మంజూరైన ఇళ్లను రద్దు చేస్తామని అధికారులు తెలిపారు.

పేద కుటుంబానికి సాయం

విశాలాంధ్ర-లింగపాలెం: సుందరరాజుపేటలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న సున్నం దాస్ కుటుంబానికి మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సందీప్ బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. తన కుమార్తెకు ఇంటర్లో 850 మార్కులు వచ్చాయని గుంటూరు ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చినా హాస్టల్ ఫీజు చెల్లించలేక చదువు మాన్పించా మని తన

కుమార్తె చదువుకోవడానికి సాయం చేయాలని ఈ దంపతులు మిత్రదీప్ ఫౌండేషన్ ను కోరారు. కుమార్తెను చదువు మాన్పించవద్దని తన వంతు సహకారంతోపాటు మరి కొందరు ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటానని సందీప్ ఈ కుటుంబానికి హామీ ఇచ్చారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-లింగపాలెం: చింతలపూడి జోన్లోని ప్రైవేటు పాఠశాలల యజమానులు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి లక్షాఅయిదువేల రూపాయలను ఎమ్మెల్యే రోషన్ కుమార్ కు అందించారు. ధర్మాజీ గూడెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల

యాజమాన్యపు నాయకులు రాంబాబు, చక్రధరరావు, రత్నాకర్, పాపారావు, పవన్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది నియామకం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం, రంగాపురం విద్యుత్ ఉపకేంద్రాలపరిధిలో పలువురు సిబ్బంది నియామకాలు జరిగాయి. ధర్మాజీగూడెం ఉప కేంద్రంలోకొత్తగా సెక్షన్ ఆఫీస్ ఏర్పాటు చేసి జూనియర్ అసిస్టెంట్గా రవికుమార్ ను నియమించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులు తదితర అంశాలకు సంబంధించి సెక్షన్ ఆఫీస్ పర్యవేక్షణలో ఉంటాయి. ఈఉప కేంద్రంలో పనిచేస్తున్న సబ్ ఇంజనీర్ అప్పారావును విజయనగరం బదిలీ చేశారు.ఈయన స్థానంలో మోహన్ ను నియమించారు. ధర్మాజీ గూడానికి మరో జేఎల్ఎంను నియమించారు. ఇక్కడ ఉపకేంద్ర పరిధిలో సిబ్బంది కొరతపై విశాలాంధ్రలో ఇటీవల వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు.ధర్మాజీ గూడానికి కొత్తగా జేఎల్ఎంగా ఎం.సూర్యం నియమించడంతో వీరి సంఖ్య మూడుకి పెరిగింది. వీరితోపాటు లైన్మెన్ కూడా ఉన్నారు.రంగాపురం ఉపకేంద్రం పరిధిలోని వేములపల్లిలో రెండు నెలల నుంచి ఖాళీగా ఉన్న లైన్మెన్ పోస్టును భర్తీ చేశారు.బి.రవిని జేఎల్ఎంగా ఇక్కడ నియమించారు. పుప్పాలవారి గూడెంకు కొత్త లైన్మెన్ పోస్టును వేశారు. ఈ గ్రామానికి అసిస్టెంట్ లైన్మెన్గా నవీనును నియమించారు.

చర్యలు తీసుకోవాలి

(1వ పేజీ తరువాయి)

రూములకు కనీసం తలుపులు,కిటికీలు లేవన్నారు. ప్రతి రూముకు 4 నుండి 6 ఫ్యాన్లు ఉండగా కేవలం1 ,కొన్ని రూములలో రెండు ఫ్యాన్లు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. మరుగుదొడ్లకు కనీసం తలుపులు లేవని, పైన టాప్ కూడా లేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోపాటుగా వసతి గృహంలో పనిచేసే ఇద్దరు సిబ్బంది జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తూ జీతం మాత్రం కొవ్వలి ఎస్.సి.వసతి గృహంలో తీసుకున్నట్లుగా తెలుస్తోందని దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా కన్వీనర్ శివకుమార్,కో కన్వీనర్ వంశీ, కృష్ణాజిల్లా కన్వీనర్ సాదిక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు కృషి

(1వ పేజీ తరువాయి)

సగటున ఐదు, ఆరు రోజుల్లో పశుగ్రాసాన్ని పెంచు కునే విధానాన్ని సిఇఇడబ్ల్యూ పరిచయం చేస్తుందన్నారు. దీని ద్వారా పశువులకు అందించే దాణ ఖర్చు కొంత తగ్గడంతో పాటు పశువులు ఎక్కువ వెన్న శాతంతో కూడిన పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. తడిధాన్యాన్ని ఆరబెట్టటకు డ్రయర్స్, మత్స్య ఉత్పత్తులకు సోలార్ రిఫ్రిజిరేటర్స్, కోల్డ్ రూమ్, కోకోవా రైతులకు సోలార్ పాలీ హౌస్ డ్రయర్స్ తదితరాలను సబ్సిడీపై అందించడానికి లబ్ధిదారులను గుర్తించి ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాల న్నారు. తొలుత సిఇఇడబ్ల్యూ ప్రతినిధులు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాంకేతికత, సౌర విద్యుత్ వినియోగించే అవకాశాలపై వివరించారు.ఈ సమా వేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, ఉద్యాన వన శాఖ అధికారి ఆర్.దేవానంద్ కుమార్, మత్స్య శాఖ అధికారి ఆర్ వి ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ట్యాక్స్

(1వ పేజీ తరువాయి)

పెంచడంతో ప్రభుత్వానికి ఆదాయం భారీగా పెరిగింది. సవరించిన పన్నుల ప్రకారం రిజిస్ట్రేషన్ సమయం నుంచి ఏడేళ్లు నిండిన వాహనాలకు గ్రీన్ టాక్స్ ఏళ్ళ వయసులో ఉన్న వాహనాలకు బోర్డర్ టాక్స్ 50 శాతం మేర గ్రీన్ టాక్స్ వసూలు చేయాలని నిర్ణయించారు.10-12 ఏళ్ళ వయసు వాహనాలకు క్వార్టర్లీ టాక్స్ తో సమానంగా,12 సంవత్సరాల పైబడిన వాహనాలకు క్వార్టర్లీ టాక్స్ రెట్టింపు మొత్తంలో గ్రీన్ టాక్స్ ఉండాలని నిర్ణయించారు.

ప్రస్తుతం 16 టైర్లు ఉన్న పెద్ద లారీకి క్వార్టర్లీ టాక్స్ రూ.15,400 గా ఉంది.అదే ఆరు టైర్ల లారీకి రూ.4,790 వరకు ఉంది. దాంతో గ్రీన్ టాక్స్ సగటున ఏడాదికి రూ 2,395 నుంచి రూ 30,820 వరకు చెల్లించాల్సి వస్తోంది.పాత వాహనాలకు గ్రీన్ టాక్స్ తో పాటు కొత్త వాహనాలకు వాటి ఖరీదు రూ.5 లక్షల లోపు ఉంటే ఒక శాతం,రూ.10 నుంచి 20 లక్షల మధ్య ఉండే వాహనాలపై 3శాతం,రూ.20 లక్షల కంటే ఎక్కువ ధర ఉండే లగ్జరీ వాహనాలపై 3 శాతం చొప్పున పన్ను పెంపుదల జరిగింది.లగ్జరీ వాహనాలపై మొత్తం పన్నులు 18శాతం వరకు ఉంటాయి. అయితే వాహనదారులపై మోపే గ్రీన్ టాక్స్ తమిళనాడులో రూ.200, తెలంగాణలో రూ.500, ఉండగా ఆంధ్రప్రదేశ్లో మాత్రం రూ.6 వేల వరకు పైగా వసూలు చేస్తున్నారని లారీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ కారణంగానే జీవో నెంబర్ 21 రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్, ఫెడరేషన్ దశల వారి పోరాటం చేస్తోంది.

లారీ యజమానుల కష్టాలు

ఏపీలో ఆటోలు, ఇతర సరుకు రవాణా వాహనాలతో కలిపి 7 సంవత్సరాలు పైబడిన రవాణా వాహనాలు మొత్తం 4.17 లక్షలు ఉన్నాయి. మరో 20.31 లక్షల వాహనాలు 15 ఏళ్ల కాలం నిండినవి ఉన్నాయి.వాటి నుంచి 2019-20లో వసూలు అయిన మొత్తం గ్రీన్ టాక్స్ కేవలం రూ.4.85 కోట్లు మాత్రమే. నూతన చట్టం అమలులోకి రావడంతో 2022 తర్వాత గ్రీన్ టాక్స్ రూపంలో సుమారుగా రూ.50 కోట్ల పైబడి వసూలు అవుతోందని రవాణా శాఖ అధికారులు తెలిపారు.15 ఏళ్ల తర్వాత ఒక్కసారిగా పెరిగిన ఈ పన్నుల భారం మోయలేనంతగా ఉందని లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.12 టైర్ల లారీకి పెంచిన పన్నులవలన 3 నెలలకు ఒకసారి రోడ్డు టాక్స్ కింద రూ.43 వేలు. దీనికి అదనంగా పెరిగిన గ్రీన్ టాక్స్ ప్రకారం ఏడాదికి రూ.22 వేలు చెల్లించాలి. నేషనల్ పర్మిట్ కు మరో రూ.17 వేలు చెల్లించాలి.థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కోసం రూ.50 వేలు ఖర్చు అవుతుంది. ఇవన్నీ కలిపి పన్నులకే ఏడాది రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని లారీ యజమానులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం దృష్టిసారించి జీవో నెంబర్ 21 రద్దు చేయాలని వాహన యజమానులు కోరుతున్నారు.

ఆరోగ్యవంతమైన శిశువులు

(1వ పేజీ తరువాయి)

తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు బాలింతలలో రక్తహీనతను నివారించే పౌష్టికా హారం ప్రాముఖ్యతను తెలియజేయ డమే పౌష్టికాహార మాసోత్సవాల ముఖ్య ఉద్దేశం అన్నారు. గర్భిణీలు బాలింతలలో రక్తహీనతను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. బాల సంజీవని స్కీం ద్వారా అనుబంధ పోషకాహారం అందిస్తున్నామని.. గర్భిణీలు బాలింతలకు బాల సంజీవని పోషకాహార కిట్టును ఇవ్వడంతో పాటు.. కోడిగుడ్లు, పాలు, బియ్యం, నూనె, పప్పు వంటివి ప్రతినెలా అందిస్తున్నామన్నారు. చిన్నపిల్లల్లో పోషకాహార లోపాల వల్ల అనారోగ్యాల బారిన పడకుండా బాలామృతం ఫుడ్ బ్యాగ్తో పాటుగా కోడిగుడ్లు, పాలు ప్రతినెల అందిస్తున్నామని తెలిపారు. బాలామృ తంతో ఎలాంటి ఆహార పదార్థాలు తయారు చేసుకోవాలో తెలియక వృధా అవుతున్న నేపథ్యంలో బలామృతంతో వివిధ రకాల రుచికరమైన ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించడానికి ఆహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శనలు ఉంచామన్నారు. సంతరం మంత్రి అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సిడిపిఓ వరాహ లక్ష్మీ, అంగన్వాడి యూనియన్ లీడర్ దుర్గ, అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

మనం చేసే పని పది తరాలకు ఉపయోగపడాలి

విశాలాంధ్ర - పెంటపాడు: మనం చేసే పని పది తరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు.పెంటపాడు మండలంలోని యానాలపల్లి, ఉమామహేశ్వ రం గ్రామాల్లో గురువారం ఆయన ఒక్కో గ్రామానికి రూ.99 లక్షల

చొప్పున నిధులతో పైపులైన్ల పనులకు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు నిర్వీర్యమైన గ్రామపంచాయతీలకు, సర్పంచులకు కూటమి ప్రభుత్వం పునర్జీవం అందించిందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చూసేందుకు మిమ్మల్ని గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునే బాధ్యత సర్పంచులదే అని అన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గంలో ప్రతి గ్రామం సుందరంగా తీర్చిదిద్దుతా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యు.డి.ఇ. సర్వేశ్వరరావు, సర్పంచ్ గోకా ఛాయాదేవి, ఉమామహేశ్వరం ఉమ్మడి నాయకులు,ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్న స్థితిలో గ్రామ లింక్ రోడ్లు

విశాలాంధ్ర- పాలకోడేరు: పాలకోడేరు మండలంలోని సుమారు అన్ని గ్రామ పంచాయతీలలో అనుసంధానమైన రోడ్లన్నీ అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని మేజర్ పంచాయతీలకు ఆదాయ వనరులు ఉన్నప్పటికీ అటు పాలక వర్గం, అధికారి

యంత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.ఇటీవల కాలంలో భారీవర్షాలు కురియడంతో గ్రామాల్లోని ప్రధాన రహదారులన్నీ గుంతలు ఏర్పడి నడవడానికి వీలు లేకుండా ఉన్నాయి. ఇక వాహనాలపై వెళ్లే వాహనదారుల తిప్పలు చెప్పనవసరం లేదు. మండలం లోని మేజర్ పంచాయతీ అయిన శృంగరక్షం గ్రామపంచాయతీ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నప్పటికీ పంచాయితీ ఎదురుగా ఉన్న రోడ్డు పరిస్థితి మరి దారుణంగా ఉంది.నిత్యం ప్రజలందరూ వివిధ పనుల నిమిత్తం పంచాయతీ ఆఫీస్ కు వస్తూ పోతూనే ఉంటారు. కొన్ని సందర్భాలలో వృద్ధులు, వికలాంగులు ఆ రోడ్డుపై ఉన్న గుంతలలో పడిన సందర్భాలు ఉన్నాయి.అయినప్పటికీ ఆ రోడ్డును పట్టించుకునే నాథుడే లేకపోయాడు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కనీసం పంచాయతీకి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక విధానం (1వ పేజీ తరువాయి)

1 శాతం రూ. 240 కోట్ల లక్ష్యానికి 101 కోట్ల పంటల రుణాలు అందించడం నిజంగా బాధాకరమైన విషయమన్నారు. గత ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో భూ యజమాని అంగీకారం ఉండాలని పెట్టిన నిబంధనతో కౌలు రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకర్లకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలోని లక్షలాదిమంది కౌలు రైతులు సాగు సమయంలో అధికవడ్డీకి ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల నుండి రుణాలు తీసుకుని నష్టపోయారన్నారు. 2024-19 తెలుగు దేశం ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో 18 లక్షల మందికి పైగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తే, గత ప్రభుత్వం కేవలం 8 లక్షలమంది కౌలు రైతులకు మాత్రమే గుర్తింపుకార్డులు జారీ చేసిందన్నారు. వచ్చే రబీ సీజన్ నాటికి కొత్త విధానాన్ని అమలులోకి తీసుకువచ్చి, అర్హులైన ప్రతీ కౌలు రైతుకీ పంట రుణాలు అందించేలా రాష్ట్రముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. జిల్లాలో ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.16 వేల 600 కోట్ల లక్ష్యానికి మొదటి త్రై మాసికంలో రూ. 3,223 కోట్లు రుణాలుగా అందించారన్నారు. జిల్లాలో పొగాకు రైతులకు రుణాలను బ్యారెన్కు 7 నుండి 8 కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, ప్రభృతులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి మిస్సింగ్ పై స్పందించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు :ఆదివారం మారేడుమిల్లి అటవీ ప్రాంతం 'జలతరంగిణి' వాగు వరదలో కొట్టుకుపోయిన ఏలూరు ఆశ్రమ వైద్య కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరి మృతదేహాలు లభ్యంకాగా, మూడవ విద్యార్థి సిహెచ్. హరదీప్ ఆచూకి ఇప్పటి వరకు తెలియలేదు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలించి నీటిలో ఎక్కడా ఆచూకి దొరకలేదని తేల్చారు.దానిపై విద్యార్థి తల్లిదండ్రులు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ దృష్టికి సమస్యను తెచ్చి గల్లంతైన హరదీప్ ఆచూకీకి సహకరించాలని కోరారు. తక్షణం స్పందించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అదనపు బలగాలను పంపించి సమీప అటవీ ప్రాంతంలో కూడా గాలింపు చర్యలు చేపట్టి, తల్లిదండ్రులకు అప్పగించాలని ఎస్.పి. ని ఎంపీ కోరారు.

రైతులు ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతిపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర – గణపవరం: ప్రతి రైతు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే కార్యక్రమాన్ని దీన్ని ద్వారా ఆధునిక వ్యవసాయ సాగు

మద్దతుపై రైతులు అవగాహన కల్పించా లని సంకల్పంతో క్షేత్ర స్థాయిలో పర్యటనలు నిర్వహిస్తున్నామని తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి. మురళీకృష్ణ అన్నారు. గురువారం గణపవరం మండలం కాశిపాడు రైతు సేవా కేంద్రం నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ వారిచే నిర్వహిస్తున్న ఈ పంట నమోదు గురించి రైతులకు అవగాహన కల్పించామన్నారు. .రైతుల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసు కొని తగిన సూచనలు ఇచ్చారు. గణపవరం మండల వ్యవసాయాధికారి ఎర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ 2024 ధాన్యం కొనుగోలులో రైతు తనకు నచ్చిన రైసు మిల్లుకు ధాన్యం తోలుకొనే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని రైతు ధాన్యం తోలిన 48 గంటల్లో రైతుల బ్యాంక్ అకౌంట్ లలో డబ్బులు చెల్లిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెర్లి నాగరాజు, బిజెపి కొయ్యల సుబ్బారావు, చింత చరణ్, జంపన రమేష్ రాజు,కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచనపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర – కొయ్యలగూడెం : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన పై అవగాహన సదస్సును ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో రోటరీ క్లబ్ వద్ద ఈనెల 28వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బొగ్గవరపు బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా బొనిగల రామారావు, చాగంటి సంజీవరావు, రవికుమార్, అలుగు ఆనంద

శేఖర్, గెడ్డం శామ్యూల్ జాషువా, కాపు దాని రవికుమార్, ఎరికపాటి విజయ్, సొబ్బన మోహన్, అందుగుల ఫ్రాన్సిస్ హాజరవుతున్నారని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన వారు అంబేద్కర్ ఆలోచన అవగాహన సదస్సులో పాల్గొనాలని బాబురావు పేర్కొన్నారు.

మార్చి లోపు ఇళ్ళు నిర్మించుకోవాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు : 2019-24 సంవత్సరాల మధ్య ఇళ్ల నిర్మాణం పూర్తి చేయని వారు వచ్చే ఏడాది మార్చి లోపు నిర్మించుకోవాలని, లేక పోతే బిల్లులు రావని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్ మనోజ్ ఉన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో గురువారం హౌసింగ్ సిబ్బంది, కార్యదర్శులకు సమావేశం జరిగింది. ఈ

సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 333 మంది లబ్ధిదారులు ఉన్నారని వారి వద్దకు వెళ్లి ఇళ్ల లబ్ధిదారులను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ఉంగుటూరు మండల హౌసింగ్ ఏఈ సురేష్ బాబు మాట్లాడుతూ ఈ అవకాశం మార్చి నెలాఖరు వరకే ఉందని లబ్ధిదారులకు వివరించ వలసిన బాధ్యత మనదేనన్నారు. ఈ సమా వేశంలో డిటి పోతురాజు, కార్యదర్శులు, ఇంజనీర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు 20లక్షల సంచులు సిద్ధం

విశాలాంధ్ర - ఉంగుటూరు: ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని, 20 లక్షల గోనెసంచులు సిద్ధం చేసినట్లు తహసీల్దార్ దుర్గాప్రసాద్ తెలిపారు. రావులపర్రు రైస్ మిల్లులో సిద్ధంగా ఉన్న గోనెసంచుల నాణ్యతను గురువారం తహసీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ పరిశీలించారు. గోనె సంచులు ఎలా ఉన్నాయి ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా గోనె సంచుల విషయంలో నాణ్యత ఉండాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గోనె సంచులకు రంధ్రాలు లేకుండా చూడవలసిన బాధ్యత రైస్ మిల్లు యజమానులు దేనని అన్నారు.

ఉంగుటూరు మండలంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు 20 లక్షలు గోనె సంచులు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 23,607 ఎకరాలు ఉండగా, 22,507 ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నా రన్నారు.రైతుల నుండి ధాన్యమును రైతు సేవా కేంద్రం ద్వారా కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. బాదంపూడి, బొమ్మిడి, నారాయణ పురం, రాచూరు,కైకరం గ్రామాలలో ధాన్యం గోడౌన్లు ఉన్నాయన్నారు. గోనె సంచులు ఇచ్చే విషయంలో సీరియల్ ప్రకారమే ఇస్తామన్నారు. ఎవరైతే ముందుగా కోతలు కోసి సంచులు కావాలని వస్తే వారి పేరు నమోదు చేసుకొని ముందుగా సంచులు ఇస్తామన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.కమల్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక దిరుసుమర్రు రహదారిలో ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఏ ఎస్ ఎన్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది విద్యార్థులు రక్తదానం చేసారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి.కమల్ మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో,శస్త్ర చికిత్సలు జరిగినప్పుడు బాధితులు రక్తం అందకుండా మృతి చెందకూడదన్నారు. 18 ఏళ్ల పైబడిన వారంతా మూడు నెలలకోసారి రక్తదానం చేస్తే రక్తనిధులు పుష్టిగా ఉంటా యని ఫలితంగా ఆపదలో ఉన్న వారికి అవసరమైన రక్తం అందించి ప్రాణాలు కాపాడవచ్చున్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్

ప్రోగ్రాం ఆఫీసర్ కళ్యాణ్ మాట్లాడుతూ రక్త దానంపై అపోహలు వీడేలా విద్యార్థులు ప్రతి ఒక్కరికి అవగాహన పర్చాలని సూచించారు. అనంతరం రక్తదాతలను అభినందించి వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో సంస్థ సభ్యులు ఏ ఎస్ ఎన్ రాజు , పి.ఆర్.ఓ మోహన్,ల్యాబ్ టెక్నీషియన్స్, కళా శాల కో-ఆర్డినేటర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు, కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వి.కమల్, ప్రిన్సిపాల్ లక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పెదకోటకళ్యాణ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వారానికి 2 గంటలు పరిశుభ్రత కోసం పనిచేయాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : జిల్లాలోని ప్రతి ప్రాథమిక వైద్యశాలలో వారానికి రెండు రోజులు పరిసరాలు పరిశుభ్రత పై శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డి. మహేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,పట్టణ ఆరోగ్య కేంద్రాలు,హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయంలో పరిసరాలు పరిశు భ్రపరిచారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారానికి 2 గంటలు స్వచ్చం దంగా పరిశుభ్రత కోసం పనిచేయాలని తద్వారా నీటివలన, గాలివలన, ఇతర

కీటకాల ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులను నియంత్రించవచ్చున్నారు. అందరు కలిసి పనిచేస్తే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మించవచ్చని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి అందులో వున్న పూర్తి వివరాలను నమోదు చేయని వారు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వెంటనే నమోదు చేయవలెనని ఆదేశించారు.

సహకార సంఘాల సేవలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: సహకార సంఘాలు అందిస్తున్న సేవలను రైతులు వినియో గించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి ఎర్రా ఏసు కుమార్ తెలిపారు. మధ్యాహ్నపు వారి గూడెం, మక్కినవారిగూడెం సహకార సంఘాల ఆవరణల్లో సిఇఓలు జి.భుజంగరావు, యు వి సత్యనారాయణ అధ్యక్షతన మహాజన సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వ్యాపారాల నిర్వహణ లాభ, నష్టాలను సిఇఓలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం సొసైటీ లు అనేక సేవలు అందిస్తున్నాయని ఆయన తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పంటరుణాలు, బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని వ్యాపారాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలు

విశాలాంధ్ర -భీమవరం: కృషి, పట్టుదల, కష్టపడే తత్వం, స్కిల్స్ ఉంటే ఏ ఇంజనీరింగ్ బ్రాంచిలో చదివినా ఉన్నత స్థానానికి వెళ్ళవచ్చని ఎస్ ఆర్ కె ఆర్ ఇంజ నీరింగ్ కళా శాల పూర్వ

విద్యార్థిని, ప్రముఖ సాఫ్ట్వేర్ సంస్థలో హెచ్ఆర్‌గా పనిచేస్తున్న కె.సత్యసుందరి పేర్కొన్నారు. ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల “ గూగుల్ డెవలపర్ గ్రూప్స్” బృందం ఆధ్వర్యంలో గురువారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. గూగుల్ డెవలపర్ ఫ్యాకల్టీ అడ్వైజర్ అనన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్య సుందరి మాట్లాడుతూ గూగుల్ డెవలపర్ గ్రూప్‌లో చేరటం వలన అంతర్జాతీయ స్థాయిలో సెమినార్లు, వర్క్ షాప్‌లు, హ్యాకత్లాన్లు వంటి వాటిలో భాగస్వామ్యం కావచ్చని పేర్కొన్నారు. గ్రూపు ఏదైనా ప్రతిభ ఉంటే ఎంతటి ఉన్నత స్థానానికైనా ఎదగవచ్చని ఆమె విద్యార్థులకు సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణంరాజు, టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ విభాగం ఇన్చార్జి హెడ్ డాక్టర్ ఎం.సురేష్ బాబు, జి డి జి ఫ్యాకల్టీ అడ్వైజర్ అనన్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో ఎస్‌కెఎస్‌డి విద్యార్థినిలు

విశాలాంధ్ర-తణుకు: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఏలూరు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే ఆదేశాల మేరకు స్థానిక ఎస్ కె ఎస్ డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటాన మస్) కళా శాలలోని ఎన్ సి సి విభాగం వారు గురు వారం స్థానిక ఎన్టీఆర్ పార్క్ వద్దనున్న

స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను, చుట్టుపక్కల ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు ఎల్ సుందరి భాయ్, ఎన్ సి సి క్యాడేట్స్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు 14మంది గురుకుల విద్యార్థులు

విశాలాంధ్ర-టి నరసాపురం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు 14మంది గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి ఎస్ బి శంకర రావు తెలిపారు.స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శంకర రావు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన ఏలూరు అల్లూరి సీతారామ రాజు స్టేడియం నందు అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో రన్నింగ్,లాంగ్ జంప్,హై జంప్,షాట్ పుట్, జావలిన్ త్రోలలో ఐదుగురుగోల్డ్ మెడల్స్, ఆరుగురు సిల్వర్ మెడల్స్ ,ఐదుగురు బ్రాంజ్ మెడల్స్ తో 14 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ లహరిదుర్గ ను ప్రిన్సిపాల్ డిఎస్‌బి. శంకరరావు,ఎటిపి కిషోర్ కుమార్ పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

వ్యక్తిత్వ వికాసం పై అవగాహన

విశాలాంధ్ర -ఏలూరు: ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్ వారి ఆధ్వర్యంలో గురువారం గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్, ఏలూరులో విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్సు పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సెట్ వెల్ సిఇఓ కె.ఎస్. ప్రభాకరరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సందేశం ఇచ్చారు. జిల్లా ఉపాధి కల్పనా అధికారి సి. మధుభూషణరావు,"కెరీర్ కౌన్సిలర్ జి.ప్రవీణ్ కృష్ణ, డిస్ట్రిక్ట్ కోర్డినేటర్,నేషనల్ కెరీర్ సర్వీస్ వి.వరలక్ష్మి,. ఇ.ఒ.,వొకేషనల్ గైడెన్స్ కోర్స్‌పై వారు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో కె. కృష్ణ ప్రసాద్, హెడ్ మాస్టర్,గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్, ఏలూరు పి.వి.యన్ సత్యనారాయణ,మేనేజర్, సెట్ వెల్ కె.జె.కెనడి , పర్యవేక్షకులు,సెట్ వెల్, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి

విశాలాంధ్ర-వీరవాసరం: చిలకమర్తి మన వీరవాసరంలో చదువుకోవడం మన అదృష్టమని,వారి నుండి స్ఫూర్తిని పొంది విద్యార్థులు సమాజ సేవకు అంకితం అవ్వాలని వీరవాసరం కళాపరి షత్ అధ్యక్షులు గుండా రామకృష్ణ పిలుపు నిచ్చారు. స్థానిక ఎంఆర్కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ జాతీయకవి చిలకమర్తి లక్ష్మీనరసింహం 157వ జయంతి వేడుకలు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శనివారపు వరప్రసాద్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కవి,రచయిత లింగం సత్యనారాయణను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పంపన సాయిబాబు మాట్లాడుతూ చిలకమర్తి లక్ష్మీనరసింహం తన కవితా చాతుర్యంతో ప్రజలలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని కలిగించారని, హరిజనోద్ధరణకు గాంధీ కంటే పూర్వమే పాఠశాల స్థాపించి,నిర్వహించి గొప్ప సంఘ సంస్కర్తగా ప్రసిద్ధి చెందారన్నారు. సభాధ్యక్షులు శనివారపు వరప్రసాద్ మాట్లాడుతూ నేటి తరం కవులకు, కళాకారులకు చిలకమర్తి స్ఫూర్తి అని, కంటి చూపు సహకరించకపోయినా కష్టపడి చదివి గొప్ప పండితుడయ్యారని అన్నారు. సన్మానగ్రహీత లింగం సత్యనారాయణ మాట్లాడుతూ తన రచనల ద్వారా బ్రిటీషు వారిని గడగడలాడించిన గొప్ప స్వాతంత్ర్యోద్యమ కారుడు చిలకమర్తి అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నూకల కనకదుర్గ, ఉపాధ్యాయులు చిలుకూరి ఫణికుమార్, వై.వెంకటేశ్వరరావు, కుసుమే ఆనందరావు, బి.విజయలక్ష్మి, వై.సత్య శ్రీనివాస్,వి.సుబ్రహ్మణ్యం, పెద్దిరాజు, రత్నరాజు, పద్మజారాణి, రవి కుమార్ విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దర్భరేవు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్

విశాలాంధ్ర -భీమవరం: దర్భరేవు గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణాలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లకు చెల్లింపులు జరిగాయని ఆ గ్రామస్తులు నుండి "మీకోసం" కార్యక్రమంలో ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ అనంతరం వాస్తవమే అని నివేదిక అందడంతో దర్భరేవు ఇంజనీరింగ్ అసిస్టెంట్ కొల్లాటి లీలా కృష్ణను ఈ నెల 26న విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా ఎస్.పి. బాలు వర్ధంతి

విశాలాంధ్ర -భీమవరం: మధుర గాయకులు, సినీ జగత్తులో ధృవతార ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని, యుగాంతం వరకు ఎస్పీ బాలు పాటలు నిలిచిపోయాయని అఖిలభారత శోభన్ బాబు సేవాసమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, పూడి శ్రీనివాస్,ఎమ్. సుధాకర్ బాబు అన్నారు. ఎస్పీ బాలు 4వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు మాట్లాడుతూ తన గళంతో ప్రపంచంలో భారత దేశ ఖ్యాతిని ఇనుమడింపచేశారన్నారు. తమిళనాడులోని ఓ రోడ్డుకు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పేరు పెడుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. అఖిల భారత శోభన్ బాబు సేవాసమితి కన్వీనర్స్ టి. సాయి కామరాజు, బి. బాలసుబ్రమణ్యం, టి. వీర ప్రసాద్, కుర్రా రాంబాబు, విజయ్, ఎస్. ఎన్. రావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, డిఆర్ఓ డి. పుష్పమణి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి సాధ్యమని గాంధీజీ ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కొత్త బస్టాండ్, జన్మభూమి పార్కుల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో జెడ్పిచైర్ పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించి అనంతరం కార్యక్ర మంలో పాల్గొన్న జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి స్వస్థ ఆంధ్రప్రదేశ్‌ను సాధించి తద్వారా స్వచ్ఛ భారత్ ను సాధించే లక్ష్యంతో కృషి చేస్తామని అందరితో ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం ఆర్ టి సి బస్టాండ్ ఆవరణలో జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, డిఆర్ఓ డి పుష్పమణి తదితరులు మొక్కలు నాటారు. అనంతరం చీపురు పట్టి రోడ్లపై చెత్తను తొలగించారు.ఈ సందర్భంగా జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17 నుండి నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను అక్టోబరు 2వ తేదీ గాంధీజయంతి వరకు స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత నినాదంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాల న్నారు. కార్యక్రమంలో జెడ్పి సిఇఓ కె.ఎస్. ఎస్. సుబ్బారావు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, మున్సిపల్ కమీషనరు ఎన్. భానుప్రతాప్, హౌసింగ్ పిడి శ్రీనివాస రావు, ఐసిడిఎస్ పిడి కె. పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర -ఏలూరు: ఏలూరు జిల్లాలో గృహ నిర్మాణ శాఖలో పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న వర్క్ ఇన్స్పెక్టర్లు ,డేటా ఎంట్రీ ఆపరేటర్లు,అటెండర్లు తమకు తమను పొరుగుసేవల విధానం నుండి తప్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సీనియారిటీ ప్రకారం ఎస్ఎంఆర్ లేదా హెచ్.ఆర్. ఉద్యోగులుగా పరిగణించాలని రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని ఏలూరులోని రెవిన్యూ అతిథి గృహంలో గురువారం కలిసి తమ సమస్యలను తెలియజేసారు. తాము ఎన్నో సంవత్సరాల నుండి పొరుగుసేవల విధానంలో గృహ నిర్మాణ శాఖలో పనిచేస్తున్నామని,తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. తమతో పాటు నియామకం జరి గిన డిఆర్డిఏ,డ్వామా, ఎన్ఆర్జిఎస్ శాఖలలోని వారికి హెచ్.ఆర్. పాలసీని అమలు చేస్తున్నారని,మాకు కూడా సీనియారిటీ ప్రకారం ఎస్ఎంఆర్ లేదా హెచ్.ఆర్. ఉద్యోగులుగా పరిగణించాలని మంత్రిని కోరారు.వారి సమస్యలను సావధా నంగా విన్న మంత్రి పార్థసారథి వారి సమస్యను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి,తగు న్యాయం జరిగేలా చూస్తానన్నారు.గృహ నిర్మాణ శాఖ సిబ్బంది కె. నాగభూషణం, పావని, చంద్రశేఖర్, కె.పోసు కుమార్, జగదీశ్, ప్రభృతులు పాల్గొన్నారు.

ఛార్జింగ్ పాయింట్ల ఇన్‌స్టాలేషన్‌తో ఈవీ వాహనదారులకు మేలు

విశాలాంధ్ర-చాగల్లు: పెద్ద ఎత్తున ఏర్పాటు అవుతున్న ఛార్జింగ్ పాయింట్లతో ఈవీ వాహనదారులకు ఉపయుక్తంగా నిలుస్తుందని నిర్వాహకులు చెప్పారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్ అనంత్ ముఖేష్ అంబానీ, బీపీ సీఈఓ ముర్రే ఆచిన్‌క్లోస్ ఆయా సంస్థల ఇంధనాలు మొబిలిటీ జాయింట్ వెంచర్ అయిన జియో, బీపీ యొక్క 500వ పల్స్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈవి ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్‌ను వేగవంతమైన వేగంతో విస్తరించిందన్నారు. కేవలం ఒక సంవత్సరంలోనే 1,300 నుండి 5,000 వరకు పెరిగిందని, దాని ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్‌లో 95 శాతం ఫాస్ట్‌ఛార్జింగ్ స్టేషన్‌లతో కూడినదన్నారు. దేశంలోనే అత్యంత విశ్వసనీయమైన ఛార్జింగ్ నెట్‌వర్క్‌గా స్థాపనకు సాటిలేని పరిశ్రమ-ప్రధాన సమయమైన 96 శాతం తో హైస్పీడ్ ఎలక్ట్రాన్‌లను అందించడానికి సిద్ధంగా ఉన్నారు. మాల్స్, పబ్లిక్ పార్కింగ్, కార్పొరేట్ పార్కులు, హోటళ్లు మరియు వంటి ప్రదేశాలలో సమర్థవంతమైన, శీఘ్ర ఛార్జింగ్ అనుభవాన్ని అందించడానికి వీలు కల్పించే ఏకైక సివిపి ల మద్దతుతో టాప్-రేటెడ్ 480 కె డబ్ల్యూ ఛార్జర్‌లను అమలు చేయడంలో జియో బిపి పరిశ్రమలో మొదటిదన్నారు. సౌకర్యాలు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఛార్జింగ్ మౌలిక సదుపాయాల ద్వారా శ్రేణి ఆందోళనను తగ్గించడం ద్వారా డిసి ఫాస్ట్ ఛార్జర్‌లతో ఛార్జింగ్ సమయాన్ని తగ్గించడం ద్వారా అత్యాధునిక జియో బిపి పల్స్ ఛార్జింగ్ యాప్ ద్వారా అతుకులు లేని ఛార్జింగ్ అనుభవాన్ని అందించడం ద్వారా, వేగవంతం చేయడంలో పోల్ పొజిషన్‌ను ఆక్రమించిందని చెప్పారు.

సర్టిఫికెట్లు పోయినవి

ఏలూరు జిల్లా పోలవరం మండలం, కొత్తూరు గ్రామ నివాసి **మారాజు గంగాధర్** కుమారుడు **మారాజు రాజేష్ గంగాధర్** తెలియజేయునది ఏమనగా **ది 20-8-2024** అనగా మంగళవారం నర్సాపురం మండలం రుస్తుం బాధలోని బంధువుల ఇంటి దగ్గర నుండి పదవ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు జిరాక్స్ తీయించుకునేందుకు వెళుతూ ఉండగా నరసాపురంలో పడిపోయినవి. నేను చిన్ననాటి నుండి రుస్తుం బాధలోని ఫ్లష్ మెమోరియల్ హయ్యర్ సెకండరీ స్కూల్ ఆఫ్ ఎస్‌డిపిలో విద్యాభ్యాసం చేశాను. నాకు సంబంధించిన పదవ తరగతి **మార్కుల లిస్టు నెంబర్ TF 30159426**,తో పాటు **పాస్ సర్టిఫికెట్, ఇంటర్మీడియట్ మార్క్ లిస్ట్ నెంబర్ BP70003361** తో పాటు, **ఇంటర్ పాస్ సర్టిఫికెట్ నెంబర్ BP 10003358** సర్టిఫికెట్లు పడిపోయినవి. దొరికిన వారు అందజేయవలసిందిగా కోరుచున్నాను.

మారాజు రాజేష్ గంగాధర్
సెల్ : 8179841175

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

విశాలాంధ్ర-లింగపాలెం:ఏలూరు జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో రంగాపురం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఎం.రూపేష్100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. ఒలంపిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో 10 సెకన్లలో లక్ష్యాన్ని చేదిస్తే ఈ విద్యార్థి 12 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకోవటం గమనార్హం. భవిష్యత్తులో జాతీయస్థాయిలో మంచి ఫలితాలు సాధిస్తాడని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.లక్ష్మీ తెలిపారు.ఇదే పాఠశాలకు చెందిన వి.వరుణ్,ఎం.హర్షవర్ధన్ అండర్-14 విభాగంలో ట్రైయాథ్లాన్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వీరిని, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలిని పాఠశాల ప్రధానోపాధ్యా యులు వెంకటరత్నం అభినందించారు.

సంక్షోభంలో సంక్షేమాన్ని అందజేశాం

విశాలాంధ్ర-కాళ్ళ : సంక్షోభంలో కూడా సంక్షేమాన్ని ఇచ్చి వంద రోజులు పూర్తి చేసుకుని అందరితో ఇది మంచి ప్రభుత్వం అనిపించుకున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని ఉండి శాసనసభ్యులు రాఘు రామకృష్ణంరాజు అన్నారు.పెదఅమిరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విజన్ 2047 అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపించాలని పనిచేస్తుండగా ఉండి నియోజకవర్గం ను 2029 నాటికే రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే ఉండి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నిలుపుతానని తెలియజేశారు. ప్రభుత్వం,మిత్రుల సహాయంతో ఇప్పటికే మురుగు కాలువలను ప్రక్షాళన చేస్తున్నామని తెలియజేశారు.

గ్రామ సర్పంచ్ దొక్కు సోమేశ్వరరావు అతని స్నేహితులు కలిసి రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే కు అందజేశారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు కోరా రామ్మూర్తి నాయుడు,జి నాగేశ్వరరావు, నందిరాజు, అలుగు సెబాస్టియన్, జవ్వాది కిషోర్, కూటమి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద ఆశా వర్కర్ల ఆందోళన

విశాలాంధ్ర-టి నరసాపురం: ఆశా వర్కర్ కాసగాని లక్ష్మీ మంగను విధుల నుండి జిల్లా అధికారులు తొలగింపు పై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆశా వర్కర్లు గురువారం ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తల పై రాజ కీయ వేధింపులు నివారించాలని, ఆశా వర్కర్ లక్ష్మీ మంగను వేధింపులకు గురి చేసిన ఎమ్ ఎల్ హెచ్ పిపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలని అమెకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో వై. విజయలక్ష్మి, ఇ. లక్ష్మి, ఎన్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చారు... ఇళ్ల స్థలాలు పంచడం మరిచారు...

పట్టించుకోని అధికారులు, అయోమయంలో లబ్ధిదారులు...

విశాలాంధ్ర - పెరవలి : పేద, మధ్యతరగతికి చెందిన వారు అనేక విధాలుగా నష్టపోతున్నారు అనడానికి ఇది ఒక నిదర్శనం. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టింది. పెరవలి మండలంలోను ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం భూములను సమకూర్చి లబ్ధిదారులకు కేటాయించింది. ఒక్కో లబ్ధిదారునికి సెంటున్నర చొప్పున కేటాయించి, స్థలం యొక్క పత్రాలను అందజేశారు. మండలంలోని ఖండవల్లి గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించి, అధికారులు వారికి చెందిన పత్రాలను కూడా అందించారు. ఖండవల్లి శివారు లంకమాలపల్లిలో 55 మంది లబ్ధిదారులకు పట్టలు ఇచ్చారు, కాని స్థలం కేటాయించలేదు. రైతుల నుండి భూమిని కొనుగోలు చేసినప్పటికి, అస్థలాన్ని లబ్ధిదారులకు కేటాయించే విషయంలో మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

జిల్లా పోటీలకు కాత్రావులపల్లి విద్యార్థులు

విశాలాంధ్ర. - జగ్గంపేట : మండలంలోని కాత్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల నియోజకవర్గస్థాయి వాలీబాల్ సెలక్షన్స్‌లో జిల్లాకు ఎంపిక కాగా, బాలుర విభాగంలో షటిల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికయ్యారు. కోకోలో ఒక అమ్మాయి జిల్లా స్థాయికి ఎంపిక అయిందని హై స్కూల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు శిరీష తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ సుంకర రవిబాబు, వైస్ చైర్మన్ లోవరాజులు వాలీబాల్, షటిల్ టోర్నమెంట్‌కు సెలెక్ట్ అయిన బాల బాలికలను మెడల్స్‌తో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయిలో గెలుపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చిన్నారుల చిరు సాయం

విశాలాంధ్ర - రావులపాలెం : సాటి మనిషి కష్టాలలో ఉన్నప్పుడు మానవత దృక్పథంతో నేను ఉన్నాను నీకు తోడుగా అంటూ ఎంపియుపి స్కూల్ రావులపాడు విద్యార్థులు పెద్ద మనసుతో వారు దాచుకున్న పాకెట్ మనితో పాటుగా గ్రామంలో డొనేషన్ చేసి ఒక చిన్న యూపీ స్కూల్ నుండి రూ. 25,000 వసూలు చేసి సిఎం రిలీఫ్ ఫండ్‌కి పంపించారు. విద్యార్థులను ప్రోత్సహించిన శేఖర్ మాస్టర్‌ని అభినందిస్తూ వారి స్ఫూర్తికి ముగ్ధులైన రావులపాలెం ఎంఈఓలు నాగకుమార్, శ్రీనివాస్ రాజు రూ. 1000 ప్రోత్సాహకా డొనేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ సునీత, జ్యోతి బాస్, కెవి శేఖర్, శ్యామల, వీరవేణి, అముల్ జోన్స్, హిమజా, వెంకటలక్ష్మీ, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనా పద్ధతుల మెరుగుదలకు ప్రణాళికలు

జిల్లా విద్యాధికారి వాసుదేవరావు

విశాలాంధ్ర - సీతానగరం: బోధన పద్ధతులు మెరుగు పేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని జిల్లా విద్యాధికారి వాసుదేవరావు అన్నారు. మండలంలోని రఘుదేవపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గురువారం జిల్లా విద్యాధికారి వాసుదేవరావు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి బెంచ్‌పై కూర్చుని ఉపాధ్యాయుడు బోధిస్తున్న పాఠాలను విద్యార్థులతో కలిసి విన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో బోధనా పద్ధతులు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రణాళికలను సిద్ధం చేశారు. వాటిని అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామన్నారు. ఈ విద్యాబోధనలో వేరే పాఠశాల ఉపాధ్యాయులను తీసుకువచ్చి విద్యార్థులకు పాఠాలను బోధించడం, కొత్త పద్ధతిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉన్న ఉపాధ్యాయులను బోధన చేయించడం వంటి వాటిని అమలు చేస్తున్నామని అన్నారు. పాఠశాలలో పెట్టే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను ఏటి పరిస్థితుల్లోని పాటించాలని లేకపోతే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. జూలై నెల వరకు నాడు నేడు బిల్లుల బకాయిలు చెల్లించారని, మిగిలిన కొన్ని పాఠశాలలో పనులు పూర్తి కాకపోవడం వలన బిల్లులు చెల్లించలేదని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం విధించే నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి స్వామినాయక్, ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలగించిన పూడికను వెంటనే తరలించండి

ఎమ్మెల్యే చినరాజప్ప

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట రైల్వే స్టేషన్ సెంటర్‌లో చేపడుతున్న మేజర్ డ్రైన్లలో పూడికతీత పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువల్లో తొలగించిన పూడికను ఆయన పరిశీలించి సాధ్యమైనంత తొందరగా దీనిని బయటకు పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న పరిస్థితి తుల్లో తొలగించిన సిల్ట్ మరలా కాలువల్లోకి జారిపడకుండా ఈ చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో అవసరం ఉన్న అన్ని డ్రైన్లల్లో పూడి కలు తొలగించి జలాలు సజావుగా ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా పూడిక తొలగింపు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు, కౌన్సిలర్లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, పార్టీ యువత అధ్యక్షులు వల్లూరి దొరబాబు, నాయకులు శెట్టిబత్తుల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి చెల్లించాలి : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర- కొవ్వూరు : జులై 1 2023 నుంచి అమలు కావలసిన 12వ పిఆర్సీని అమలు చేయకపోవడం శోచనీయం అని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు అన్నారు. కొవ్వూరు రూరల్ మండలంలోని పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. పిఆర్సీ, డీఏ బకాయిలతో పాటు రెండు సంవత్సరాలుగా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న ఆర్జిత సెలవుల బకాయిలు పీఎఫ్ తదితర బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలన్నారు. లేని పక్షంలో మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. జిల్లాలను మొదటి స్థానంలో నిలపాలంటూ అధికారులు వత్తిడి చేయడం తగదన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు వల్ల జరిగిన లోపాలను సవరించాలని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సీనియర్ నాయకులు షేక్ జానీ మాష్టారు, కొవ్వూరు రూరల్ ప్రధాన కార్యదర్శి సలీం, కార్యదర్శి సురేష్, రూరల్ అధ్యక్షులు విష్ణు ఉన్నారు

నిబంధనలకు విరుద్ధంగా పోస్టు ఆఫీస్ ప్రహరీ

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పోస్టు ఆఫీసు ప్రహరీ గోడ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు అధికారులకు పిర్యాదు చేసారు. దీంతో రాజోలు ఇంచార్జి తహశీల్దార్ మృత్యుంజయ రావు గురువారం అక్కడికి చేరుకుని పోస్టు ఆఫీసు భవన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మాణం పంచాయతీ రోడ్డును ఆక్రమణ చేసి నిర్మిస్తున్నారని దీనివలన వల్ల త్రాగునీటి పైప్ లైన్, డ్రైనేజీ నిర్మాణం, వాహనాలు పార్కింగ్‌కు విఘాతం కలిగే ప్రమాదం ఉందని స్థానిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యే దేవ వంప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా స్థలాన్ని సర్వే చేసే వరకు ప్రహరీ గోడ నిర్మాణం నిలుపుదల చేయాలని అధికారులు ఆదేశించినా కాంట్రాక్టర్ దౌర్జన్యంగా పనులు చేపడుతున్నాడని స్థానిక వార్డు సభ్యుడు దారపురెడ్డి బాబ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా నిర్మించిన పిల్లర్లు తొలగించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. ఇదిలా ఉండగా అదే ప్రాంగణంలో ట్రెజరీ నూతన భవన నిర్మాణం కొరకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కూడా ఆక్రమణ చేసి పోస్టు ఆఫీసు భవనం నిర్మిస్తున్నారని ట్రెజరీ ఉద్యోగులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసారు. ఆక్రమనకు గురైన తమ స్థలాన్ని ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, కూటమి నాయకులు సూరిశెట్టి శ్రీను, నామన షణ్ముఖ్, రేఖపల్లి శ్రీను, విజయ్, వెంకట రమణ పాల్గొన్నారు.

నందిక మహాలక్ష్మి కుమార్‌కు 'నేషనల్ ఎక్సలెన్స్'

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం రూరల్ : తూర్పు గోదావరి జిల్లా పంచాయతీరాజ్ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నందిక మహాలక్ష్మి కుమార్ సెప్టెంబరు 19 న గురువారం హైదరాబాద్‌లోని గవర్నర్ క్యాంపు కార్యాలయంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. విద్యాధికుడు, నిత్యాభ్యాసి అయిన డా మహాలక్ష్మీ కుమార్ దాదాపు 50 డిగ్రీలు చేసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచినందుకు గవర్నర్ అభినందించినట్లు మహాలక్ష్మి కుమార్ తెలిపారు. "వర్ధధార హెల్త్ ఆర్గనైజేషన్" సంస్థ ద్వారా ఉచితంగా కౌన్సిలింగ్, సైకోథెరపి మొదలైన సేవల ద్వారా ఎంతో మందికి చేయూతనిస్తున్నారు. అవార్డు పొందిన సందర్భంగా జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి మహమ్మద్ అలిముల్లా, సిబ్బంది, ఇతర జిల్లా అధికారులు, యస్.ఆర్.ప్రింటర్స్ సురేష్ కుమార్, సామాజికవేత్త వనుం శ్రీనివాస్, అత్తిలి రాజు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

సేవలతో ఆత్మ సంతృప్తి

సర్వ్ విత్ హార్ట్ స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షులు ప్రశాంత్

విశాలాంధ్ర - రాజానగరం : తమ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న వివిధ సేవలు ద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందనీ సర్వ్ విత్ హార్ట్ స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షులు వేమగిరి ప్రశాంత్ కుమార్ అన్నారు.సర్వ్ విత్ హార్ట్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బొమ్మూరులోని లెప్రసీ కాలనీలో గురువారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు , దాతల సహకారంతో, గడిచిన నాలుగు సంవత్సరాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, సంస్థ సభ్యులు అమూల్య సమయాన్ని, ధన్నాని వెచ్చించి దాతల సహకారంతో ఈ దాతృత్వ కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అందర్నీ అభినందించారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు హుస్సేన్ రబ్బానీ, ఎం.రవీంద్ర,ఎల్.శ్రీనివాస్, ఫణి, శర్మ, రాజేష్, బి.వి. రామకృష్ణ, అనిల్, తేజ, రాంలింగేశ్వర్ పాల్గొన్నారు.

కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - కొవ్వూరు : అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పాటు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బందిపై చైర్పర్సన్ భావన రత్నకుమారి మండిపడ్డారు గురువారం కొవ్వూరు పట్టణం నాలుగో వార్డుకు చెందిన మహిళ వాంతులు విరోచనాలతో బాధప డుతూ తెల్లవారుజామున 4గంటలకు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చింది. సిబ్బంది నిద్రావస్థలో ఉండి రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహారం చడంతో చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ఉదయం 6 గంటలకు ఆసుపత్రిని ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా భావన రత్నకుమార్ మాట్లాడుతూ కొవ్వూరు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పనిచేయాలి అన్నారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో రోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వైద్యం చేయించుకుంటున్నారన్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆసుపత్రికి చేరుకునే రోగులకు ప్రాథమిక వైద్యాన్ని అందించకపోగా రాజమండ్రి ఆసుపత్రికి రెఫరీ రాయడం అలవాటుగా మారింది అన్నారు. ఆసుపత్రి సిబ్బంది పనితీరుపై స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర దృష్టికి తీసుకు వెళ్లి నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడి రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు

అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా
భారతీయ పొగాకు ఉత్పత్తి చేయాలి

విశాలాంధ్ర - దేవరపల్లి: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా భారతీయ పొగాకు ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ పేర్కొన్నారు దేవరపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పొగాకు రేటు ఆశాజనకంగా ఉందని, అయితే వచ్చే సంవత్సరం ఈ రేటు ఉంటుందని రైతులు భావించవద్దని, కొంత ఆశాజనకంగా ఉంటుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్లో 170 మిలియన్ కిలోలు కర్ణాటకలో 100 మిలియన్ కిలోలు మించి ఉత్పత్తి చేయవద్దని తెలిపారు. ఎట్టి పరిస్థితులలోనూ బోర్డు అనుమతించిన మేరకే పొగాకు ఉత్పత్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పొగాకు పూర్తి రీజనల్ మేనేజర్ జీవిఎల్కె ప్రసాద్, దేవరపల్లి వేలం కేంద్రం నిర్వాహణ అధికారి పి హేమస్మిత , రైతు నేతలు ఆచంట గోపాలకృష్ణ, కరుటూరి శ్రీనివాస్, కాట్రు సత్యనారాయణ ఈలపోలు చిన్ని దుద్దుపూడి హరిబాబు, సింహాద్రి, ధర్మావతారం, సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, యాగంటి సాయిబాబు, పొగాకు బోర్డు ఫీల్డ్ ఆఫీసర్, రైతులు, నల్ల రేగడి రైతులు పాల్గొన్నారు.

మానవ జీవితంలో విద్యార్థి దశ కీలకం

విశాలాంధ్ర - అనపర్తి : యువత అన్ని రంగాల్లో రాణిస్తూ ఉత్తమ ప్రతిభ చూపాలని ముఖ్యం గా వృత్తి విద్య నైపుణ్యాల పట్ల ఆసక్తి పెంపొందించుకోవడం ద్వారా జీవిత లక్ష్యాలను చేరుకోవచ్చని ప్రిన్సిపల్ ఎన్ నవీన్ అన్నారు. గురువారం స్థానిక శ్రీ సాయి మాధవి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే, గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంత సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. సాయి మాధవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తేతలి రామ భద్రా రెడ్డి (మల్లంపూడి) మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు అన్నారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. సత్యభామ స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవిలత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సతీష్ రెడ్డి, ఐఐటి, నీట్ అకాడమీ ఇన్చార్జ్ శివయ్య, సత్యమ్మ, స్కూల్ ప్రిన్సిపల్ అమన్ రషీద్ పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నాలుగు అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్టు స్థానిక ప్రాజెక్ట్ సిడిపిఓ పూర్ణిమ తెలిపారు. గురువారం ఆమె మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల పరిధిలో నాలుగు అంగన్వాడీ సహాయకులు పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. మండలంలోని జె కొత్తూరు, రాజుపూడి గ్రామాల్లో 2వ అంగన్వాడీ కేంద్రాల్లో ఓసీ రిజర్వేషన్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కిర్లంపూడి మండలం జగపతినగరం 9వ అంగన్వాడీ కేంద్రంలో బిసిడికు చెందిన వారు, గండేపల్లి మండలం యల్లమిల్లి 2వ అంగ న్వాడీ కేంద్రానికి ఓసికి చెందిన వారు దరఖాస్తులకు అర్హులన్నారు. ఈ దరఖాస్తులను అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అనుమతిస్తారని తెలిపారు. దరఖాస్తులను షాధిఖానా ఎదురుగా ఉన్న సిడిపివో కార్యాలయంలో అందజేయాలని సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

పూర్తిగా నష్టపోయిన పంటలకు
రూ.30 వేలు పరిహారం చెల్లించాలి : సూర్యచంద్ర

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : ఏలేరు వరదలకు పూర్తిగా నష్టపోయిన పంటలకు రూ.30 వేలు పరిహారం చెల్లించాలని సామాజిక ఉద్యమకారుడు పాఠంశెట్టి సూర్యచంద్ర సీఎం చంద్రబాబును కోరారు. ఏలేరు ముంపు పొలాలను సూర్యచంద్ర గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ముంపు ప్రాంతాల్లో పర్యటించి ఎకరాకు పదివేల రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఐతే ఆ సొమ్మును నేడు రైతుల ఖాతాల్లో నష్టపరిహారంగా చెల్లిస్తున్నందుకు రైతులు తరుపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పంట పూర్తిగా నష్ట పోయిన పంటలకు పదివేల రూపాయలు పరిహారం న్యాయం కాదని, ఎకరానికి రూ.30 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వంలో మిల్లర్ల సమస్యకు ముగింపు

విశాలాంధ్ర - కాకినాడ : సంక్షోభంలో ఉన్న రైస్ మిల్లర్లను ఆదుకొని వారి సంక్షేమానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కట్టు బడి ఉందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీని వాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పేర్కొన్నారు. గురువారం కాకినాడలోని జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ హాలులో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన వల్లూరి సూర్యప్రకాశరావు (సూరిబాబు)కు అభినం దన సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉదయ్, చినరాజప్పలు మాట్లాడుతూ తమ కూటమి మిల్లర్లకు నిరంతరం సహాయపడుతుందన్నారు. గతంలో చిన్న రైస్ మిల్లు చాలా ఇబ్బందులు పడ్డాయని అది తమకు తెలియ దంతో ఈసారి చిన్న పెద్ద అనే తేడా లేకుండా అం దరికీ సమానంగా ధాన్యం అందిస్తామని చెప్పారు. ఈసారి కూటమి ప్రభుత్వంలో మిల్లర్ల సమస్యకు ముగింపు పలుకుతుందన్నారు. అనంతరం రైస్ మిల్లర్లు వారు ఎదుర్కొంటున్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎన్నికైన సూరి బాబును రైస్ మిల్లర్లు, అతని అభిమానులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నున్న రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బాబు, రాష్ట్ర మిల్లర్ అసోసియేషన్ ట్రెజరర్నాయుడు ఉమ్మడి జిల్లా మిల్లర్లు హాజరయ్యారు.

రాజకీయాలకు గనిశెట్టి గుడ్‌బై

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం వైసీపీకి చెందిన గనిశెట్టి రమణలాల్ ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. గనిశెట్టి నేను ఏ రాజకీయ పార్టీలోను ఉండ టం లేదని స్పష్టం చేశారు. 2014 నుంచి 2019 వరకు వైసీపీ ప్రతిపక్షంలో వున్నప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ వెంట కీలకంగా ఉండే వారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడం విశ్వరూప్ మంత్రి కావడం జరిగాయి. అయితే రమన్ లాల్ ను విశ్వరూప్ పూర్తిగా విస్మరించారు. ఆయన ఆశించిన చిన్న పదవి కూడా దరి చేరనివ్వలేదు. దాంతో ఆయన అంటి ముట్టనట్టుగా పార్టీలో ఉంటూ పూర్తిగా సినిమా రంగం పై దృష్టి పెట్టారు. వ్యక్తిగత కారణాలతో రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలుగుతున్నట్లు ఆయన ప్రకటించారు.

మహిళా సాధికారత అవసరం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మారుతున్న ఆధునిక సమాజంలో మహిళా సాధికారత కుటుంబ సమాజాభివృద్ధికి ఎంతో అవసర మని టిడిపి నేత బొదిరెడ్డి గోపాలకృష్ణ అన్నారు. పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన చేతి వృత్తులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ ఉన్నతికి పురుషులతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. అర్బన్ ప్రాంతాల్లో మహిళా సంఘాలు ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని కుటీర పరిశ్రమలు ప్రారంభించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్య క్షుడు నారాయణ స్వామి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో - చైర్మన్ జొన్నాడ వీరబాబు, కౌన్సిలర్లు యండగుండి నాగబాబు, కోణాల వెంకట రమణ, మామిడి శ్రీను, మెప్మా టిఎంసి సాయికుమార్, సిఓలు, ఆర్పిలు ఉన్నారు.

ఆదిత్య ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కాలేజ్, రాజమండ్రి డెల్టా హాస్పిటల్స్ కలిసి కాకినాడ జిల్లా మల్లే పల్లె గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డా డి సతీష్ కుమార్ తెలిపారు. ఈ శిబిరం మల్లెపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా, 250 మందికి పైగా గ్రామస్తులు దీనివల్ల ప్రయోజనం పొందారు. ఈ శిబిరంలో సాధారణ వైద్య సలహాలు , అవసరమైన వారికి ఉచిత మందులు అందించారు. గ్రామ అధ్యక్షురాలు బి వరలక్ష్మి గంగరాజు, ప్రధానోపాధ్యాయురాలు జీవిస్ మాధురి ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు, మల్లెపల్లెను ఈ శిబిరం కోసం ఎంపిక చేసినందుకు, ఆదిత్య విద్యాసంస్థల ఉపాధ్యక్షులు డా ఎన్ సతీష్ రెడ్డి, ఆదిత్య ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా డి సతీష్ కుమార్, యూనిట్, డెల్టా హాస్పిటల్ మేనేజ్మెంట్, డెల్టా హాస్పిటల్ డీజీఎం శివ ప్రసాద్, చి రుద్ర, డాక్టర్లు కేవీఎల్ నరసింహా రెడ్డి, ఎం కిరణ్మయి సాయికు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర - ముమ్మిడివరం : యానం నుంచి అక్రమంగా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని ఆటోలో తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ముమ్మిడివరం ఎస్సై డి జ్వాలా సాగర్ తెలిపారు. అల్లవరానికి చెందిన గుండుపల్లి వీరబాబు ఆటోలో యానం నుండి మాన్షన్ హౌస్ 150 నిబ్బలు, మూడు ఫుల్ బాటిల్స్ నాలుగు బీర్ బాటిల్స్ తరలిస్తున్నాడు. ముమ్మిడివరం కొండాలమ్మ చింత వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడటంతో ఆటోను, మద్యం, సీజ్ చేసి, వీరబాబు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండె జబ్బులపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-దేవరపల్లి: మానసిక ఆందోళన ధూమపానం ఆహార నియమాలు సరిగా పాటించక పోవడం వలన గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని దేవరపల్లి సుమంత్ మల్టీస్పెషల్టీ ఆసుపత్రి వైద్యులుడాక్టర్ కే సుమంత్ పేర్కొన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా దేవరపల్లిలో డాక్టర్ సుమంత్ హాస్పిటల్లో గురువారం గుండె జబ్బుల పై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో గుండె జబ్బు రావటానికి వయసుతో సంబంధం లేదని 20 సంవత్సరాల నుండి 80 సంవత్సరాల వయసు వారికి కూడా గుండె జబ్బులు వస్తున్నాయి అన్నారు. గుండె జబ్బులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు జబ్బు వచ్చిన తర్వాత హాస్పటల్ కి వెళ్లే కంటే ప్రారంభంలోనే తగిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన అన్నారు . కొంతమంది దూర ప్రాంతాలు నగర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటే గొప్పగా భావిస్తారని , గ్రామీణ ప్రాంతాల్లో కూడా అన్ని సౌకర్యాలతో కూడిన హాస్పిటల్స్ వస్తున్నాయని, హాస్పిటల్ లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈనెల 27 28 29 తేదీలలో ప్రపంచ గుండె దినోత్సవం పురస్కరించుకొని దేవరపల్లి సుమంత్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మూడు రోజులపాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ వైద్య శిబిరానికి అనుభవిజ్ఞులైన వివిధ విభాగాలకు చెందిన 15 మంది డాక్టర్లు వస్తున్నారని ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు దేవరపల్లి పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. దేవరపల్లి ఎస్సై వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పని ఒత్తిడి వలన ఆరోగ్య విషయాలపై అజాగ్రత్తతో ఉండకూడదని తెలిపారు. ఈ సందర్భంగా దేవరపల్లి బి హెచ్ ఎస్ ఆర్ అండ్ బి ఎల్ ఎం డిగ్రీ కళాశాల హర్షవర్ధన పాఠశాల దేవరపల్లిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కడియం సూర్యనారాయణ డాక్టర్ శరత్ చంద్రిక తెలుగుదేశం నేతలు గన్నమని హరికృష్ణ, కంచిపూడి సుబ్బారావు, ఉప్పులూరి రామారావు, కూచిపూడి చక్రవర్తి, సాంబ సూర్య చంద్రం, పరిమి శ్రీరామకృష్ణ నున్న నాగేశ్వరరావు, జనసేన నాయకులు కంబాల సత్తిబాబు, చప్పటి శివ నాగ ప్రసాద్, సూరిశెట్టి బాలు, ఆస్పత్రి సిబ్బంది దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్ అండ్ వి ఎల్ ఎం డిగ్రీ కళాశాల ఏవో డి ఆనంద ప్రసాద్, హర్షవర్ధన, పాఠశాల ప్రిన్సిపాల్ బాబి పాల్గొన్నారు.

జీ తెలుగులో సరిగమప సీజన్ 16

ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ లాంచ్

విశాలాంధ్ర -తూర్పుగోదావరి: జీ తెలుగు సరిగమప సీజన్ -16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ ఈ నెల 29న, సాయంత్రం 6 గంటలకు, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రసారమవుతుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయకులకు ప్రోత్సహించే లక్ష్యంతో డాన్సింగ్, సింగింగ్ షోలతో మట్టిలో మాణిక్యాలను జీ తెలుగు గుర్తిస్తుందన్నారు. ఇందులో భాగంగానే విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చేసుకున్న సింగింగ్ షో 'సరిగమప' కొత్త సీజన్ ప్రారంభం కానుందన్నారు. ఈ సీజన్లో గాయనీ గాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే మూడు జట్లుగా పోటీపడతారన్నారు. ఈ జట్లకు మెంటర్లుగా రేవంత్, రమ్య బెహరా, అనుదీప్ దేవ్ నాయకత్వం వహిస్తారన్నారు. ఈ సీజన్ కు ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా, సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు.

జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడూరు మాట్లాడుతూ, "యువ, అసాధారణ ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ లాంచ్ ప్యాడ్ గా ఉన్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సీజన్లోనూ ప్రతిభావంతులైన గాయనీ గాయకులను ప్రోత్సహించడమే మా లక్ష్యమన్నారు. ఇప్పటికే మనం చూసిన ఎనర్జీ, ప్యాషన్, టాలెంట్ చెప్పుకోదగ్గవన్నారు. తమ కలలను నిజం చేసుకోవడమే కాకుండా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఓ వేదికను అందించడమే మా ఉద్దేశమన్నారు. ఈ సీజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నామంటూ ధీమా వ్యక్తం చేశారు.

దంత వైద్యశిబిరాన్ని సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : తమ వర్సిటీ ప్రాంగణంలో రెండు రోజులు పాటు జరగనున్న దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ వర్సిటీ ప్రాంగణంలో జీఎస్ఎల్ దంత కళాశాల ఆధ్వర్యంలో గురువారం దంత వైద్య శిబిరాన్ని విసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రెండు రోజులు పాటు దంత పరీక్షలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.దంత వైద్యానికి సంబంధించిన ప్రాథమిక చికిత్సతో పాటు డెంటల్ క్లినిక్ వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వైద్య బృందా నికి, క్యాంపును ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి వెంకటేశ్వర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం శిరీష, డాక్టర్ డి. అప్పలరాజు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

దళిత సంఘాలు డిమాండు

విశాలాంధ్ర - యానాం : యానాం సావిత్రి నగర్‌కి చెందిన మల్లాడి రాజు ఇటీవల సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతూ దళితుల పట్ల అవమానకరంగా మాట్లాడటంతో గురువారం సాయంత్రం పలు దళిత సంఘాల నాయకులు రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్‌కి వినతిపత్రం అందించారు. దానికి సంబంధించిన వీడియో ఎవిడెన్స్‌లను సీడీ రూపంలో అందించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ అవమానకరంగా అనుచిత వాక్యలు చేసిన రాజుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే తీవ్ర స్థాయి ఆందోళన చేపడుతామని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు కూడా పంపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పండు సిద్ధార్థ కుమార్, మోకా బుజ్జి, సభతి లోకేశ్వరావు, మెల్లం చిన్నా, సబ్బతి శ్రీనివాస్, యాళ్ల వెంకట కుమార్, దుగ్గుర్తి మనోజ్, నల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల అవసరాలను తీర్చేందుకు అటు ప్రజా ప్రతినిధులుగా తాము, ఇటు అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక డివిజన్లకు సంబంధించి 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా వేదిక కార్యక్రమం గురువారం సాయంత్రం కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వెనుక గల విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ మనోహర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వనమాడి మాట్లాడుతూ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోనూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికే ప్రాధాన్యమిస్తోం దన్నారు. అధికారులు, ప్రజల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడం కోసమే వారందరినీ ప్రజావేదిక కార్యక్రమానికి రప్పిస్తున్నామని, వారందరి ఫోన్ నంబర్లు తీసుకుని సమస్యలేమైనా ఉంటే నేరుగా ఫోన్ చేయవచ్చని ప్రజలకు సూచించారు. అధికారులను ప్రజలకు పరిచయం చేశారు. అలాగే కాకినాడ నగరంలో ఉన్న అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, కాకినాడ నగరాన్ని స్వచ్ఛ నగరం గాను, గంజాయి రహిత నగరంగాను తయారు చేస్తామన్నారు. ఇప్పటికే కాకినాడలో గంజాయి తగ్గుముఖం పట్టిందన్నారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వం స్థలాల పేరుతో ప్రజలను నిలువునా ముంచిందన్నారు. ఎక్కడో నగరానికి దూరంగా కొమరగిరిలో లే అవుట్లు వేసి ప్రజలకు నరకం చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ మనోహర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మెషిన్ మేనేజర్ డి వెంకట్రాజు, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, యానిమేటర్లు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో వర్క్‌షాప్ నిర్వహణ

విశాలాంధ్ర - కాకినాడ : జేఎన్‌టీయూకే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సెమినార్ హాలులో ఏఐసిటిఈ ప్రాయోజితంతో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ , మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసస్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ 26 గురువారం ఉదయం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రెక్టార్ ప్రొ కెవి రమణ ముఖ్య అతిథిగా విచ్చేయగా గౌరవ అతిథులుగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్ర నాథ్, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు, రీసోర్స్‌పర్సన్‌గా హైదరాబాద్‌లోని డిఆర్‌డిఓ మాజీ డైరెక్టర్ ఎస్ సాయి కుమా ర్ విచ్చేశారు. మెకానికల్ ఇంజనీ రింగ్ విభాగాధిపతి లింగరాజు వర్క్‌షాప్‌నకు అధ్యక్షత వహించగా డా వి జయ ప్రసాద్ కో-ఆర్డినేటర్‌గాను, డా వి కళ్యాణ మనోహర్ కో-కోఆర్డినేటర్‌గాను వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ప్రొ కెవి రమణ మాట్లాడుతూ భారతీయ భాషలకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ప్రాంతీయ భాషలలో ఏఐసిటీఈ సహకారంతో వర్క్‌షాప్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని అధ్యాపకులకు, రీసెర్చ్ స్కాలర్లకు, విద్యార్థులకు ఉపయోగపడే విధం గా ఇటువంటి వర్క్‌షాప్‌లను నిర్వహించాల న్నారు. మెటీరియల్స్ రంగంలో సిలికాన్, జెర్మేని యంలు రెండూ ప్రపంచాన్ని సాంకేతికంగా శాసి స్తున్నాయన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యా ర్థులకు మెటీరియల్స్ రంగంలో అనేక అప్లికేషన్‌లు రూపొందించేందుకు అవకాశం ఉందని, వాటిని సద్వినియోగపర్చుకుని ముందడుగు వేయాలన్నారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొవి రవీంద్రనాథ్ మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలోని పరిక రాలపై మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్‌లను ప్రత్యక్షంగా వివరించడంతో విద్యార్థులకు పూర్తి కలుగుతుందన్నారు. ప్రస్తుత సాంకేతికతను అంది పుచ్చుకోవడం ద్వారా ఇంజనీరింగ్‌లోను మరియు వైద్య రంగంలోను మెటీరియల్స్ ప్రాముఖ్యత మరింత పెరిగిందన్నారు. రీసోర్స్‌పర్సన్‌లు అందిం చే విలువైన సమాచారాన్ని విద్యార్థులు సద్విని యోగపర్చుకోవాలని సూచించారు. యుసిఇకె ప్రిన్సి పాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు మాట్లాడుతూ ఇక్కడి లేబొరేటరీలలోని అధునాతన పరికరాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగపర్చుకునేలా మరిన్ని వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రీసోర్స్‌పర్సన్ డా ఎస్ సాయికుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు ఇటువంటి వర్క్‌షాప్‌ల ద్వారా సంబంధిత సబ్జెక్ట్‌లలో నిష్ణాతులుగా మారడం ద్వారా విద్యార్థులకు ఉత్తమమైన బోధనను అందించగలరన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, రీసోర్స్‌పర్సన్‌లు, పాల్గొన్నారు.

స్టాంప్ డ్యూటీ నిధుల విడుదలకు కృషి చేస్తా ..

ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

విశాలాంధ్ర - కాకినాడ : మండలంలోని పలు మేజర్ పంచా యతీలకు స్టాంప్ డ్యూటీ నిధుల విడుదల విషయాన్ని ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి నిధుల విడుదలకై కృషి చేస్తానని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ తదితరులు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు స్టాంప్ డ్యూటీ నిధుల విడుదల కోరుతూ వినతి పత్రం అందజేశారు. రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ గతంలో రమణయ్యపేట పంచాయతీ ఆర్థిక సంఘం నిధులు, స్టాంప్ డ్యూటీ, ఇంటి పన్నులు, బిల్డింగు నిర్మాణ ఫీజులు తదితర నిధులతో ఆర్థికంగా పటిష్టంగా ఉండి ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతుండేవని అన్నారు. కానీ ఇటీవల పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు, తాత్కాలిక సిబ్బందికి కూడా జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీ ఎన్నికలు జరపకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని అన్నారు. ప్రతి ఏటా రూ.2.5 కోట్లు ఆర్థికసంఘ నిధులు కోల్పోయామని అన్నారు. 2022 నుండి స్టాంప్ డ్యూటీని కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని అన్నారు. 350 చదరపు మీటర్లకు పైన నిర్మించే భవనాల ఫీజులను కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వసూలు చేస్తుందని అందులో పంచాయతీకి రావలసిన వాటా కూడా విడుదల కావడం లేదని అన్నారు. స్టాంప్ డ్యూటీ నిధులు కోరుతూ స్థానిక ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు అడబాల తెలిపారు. చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఎస్ నగేష్, రాజా, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు.

ఏచూరి నేటితరం నాయకులకు ఆదర్శం
సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర - ఏలూరు : దేశంలో యునైటెడ్ ఫ్రంట్, యుపిఏ-1 రెండు ప్రభుత్వాలకు కీలకంగా వ్యవహరించిన మార్క్సిస్ట్ ఉద్దండుడు, మేధావి,మాజీ పార్లమెంటు సభ్యులు, సీనియర్ రాజకీయవేత్త సీతారాం ఏచూరి నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయుడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, ఏలూరు శాసనసభ సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కొనియాడారు. ఏలూరులోని స్థానిక ఆర్ఆర్ పేటలోని కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో గురువారం సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్.ఎస్) సంస్మరణ సభ సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి రవి అధ్యక్షతన జరిగింది. సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, ఆర్ఎస్ చిత్రపటానికి సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.ఎస్, నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు ముఖ్య వక్తలుగా విచ్చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఒక గొప్ప రాజకీయ నాయకుడని, దేశ రాజకీయాలు గురించి, మతోన్మాదం గురించి, పీడిత వర్గాల కష్టాల గురించి తెలిసిన నాయకుడని కొనియాడారు. జిల్లాలో రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్.ఎస్) సుమారు 70 సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయ జీవితంలో సిపిఎం సిద్ధాంతాలకు కట్టుబడి తుది శ్వాస వరకు పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. సభలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎంఎస్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన రావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఒక్క సిపిఎం పార్టీకే కాకుండా వామపక్ష పార్టీలకు వేగుచుక్కలా వ్యవహరించారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ లింగరాజు,పి. కిషోర్,జి రాజు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. చివరిగా సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి ఎం వి డి ప్రసాద్ వందన సమర్పణతో సభ ముగించారు.

ఇసుక రవాణా వాహనాలకు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: ఇసుక రవాణాకు సంబంధించిన వాహనాల రిజిస్ట్రేషన్‌కు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి టిప్పర్ల యజమానుల సంఘాలకు తెలి పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి టిప్పర్ల యజమానులతో సమావేశమై ఇసుక రవాణాకు వాహనాల రిజిస్ట్రేషన్స్ పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో భాగంగా ఇంటికి ఇసుక డోర్ డెలివరీ చేసే టిప్పర్లు డిపాజిట్ చెల్లించడం, అఫిడవిట్ రూపంలో ఒప్పందం చేసుకోవడం వంటివి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు. టిప్పర్ల రిజిస్ట్రేషన్‌కు వెంటనే దరఖాస్తు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఉదయ భాస్కరరావు, ఆర్డీవో పి.ఉమామహేశ్వరరావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి జయ ప్రసాద్, టిప్పర్ల యజమానుల సంఘాలకు చెందిన రావూరి రాజా,బండారు సత్తిబాబు, నాగరాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, యాతం గణపతి, వెంకటరత్నం పాల్గొన్నారు.

కరప తహశీల్దార్‌గా నందిపాటి

విశాలాంధ్ర - కరప : కరప తహశీల్దార్‌గా నందిపాటి సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన తహశీల్దార్ గోపాలకృష్ణ పిఠాపురం బదిలీపై వెళ్లడంతో నందిపాటి సత్యనారాయణ బాధ్యతలు తీసుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్‌గా అనిల్, ఆర్ఐ మాచర్రావు, సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు, తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుకలారీ పట్టివేత

విశాలాంధ్ర - యానాం : యానాం కనకాలపేట నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పోలీసులు పట్టుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ రూ.10,000 జరిమానా విధించారు.

బ్యాంకర్లు వ్యవసాయానికి ఊతమివ్వాలి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా బ్యాంకర్లు పనిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బ్యాంకర్లకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో మంత్రి పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరం రూ. 18,256 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా 2 వేల కోట్ల రూపాయల అధికంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వార్షిక రుణప్రణాళికను రూపొందించడంపై బ్యాంకర్లను మంత్రి అభినందించారు. ఇదే సందర్భంలో కౌలు రైతులకు, చిరువ్యాపారులకు, యువతకు సంబంధించి రుణ వితరణ మరింత మెరుగ్గా ఉండేలా చూడాలన్నారు. కౌలు రైతులకు రుణాలు సులభంగా అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రుణాలు సంక్షేమ పథకాల అమలు రుణ లక్ష్యాలపై ఆయన సమీక్షించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వర్షాలు,వరదల మూలంగా పంటలకు అవసరమైన సస్యరక్షణ, ఎరువుల కొనుగోలు కోసం రైతులకు ఈ సమయంలో రుణ సౌకర్యం అవసరమవుతుందన్నారు. రైతులకు ప్రస్తుతం రుణాలు మంజూరు చేస్తే, వారిని ఎంతో ఆదుకున్నవాళ్ళం అవుతామని, రైతులకు కూడా రుణాలు తిరిగి చెల్లించేందుకు అనువైన పరిస్థితులు కూడా ఉన్నాయన్నారు తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు చెక్ లిస్ట్ ప్రకారం తనిఖీ చేసి, ఎల్డిఎంతో సంప్రదించాలన్నారు ఈసమావేశంలో ఆర్బీఐ ఎల్డివో పి .ఎం. పూర్ణిమ, లీడ్ బ్యాంకు రీజినల్ హెడ్ నాంపల్లి శ్రీనివాస్, డిఆర్డిఏ ఆర్. విజయరాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ భాషా, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు,ఉద్యానవనాలు శాఖ డిడి రామ్మోహన్, మత్స్య శాఖ జేడీ నాగలింగాచారి, బి.సి. కార్పొరేషన్ ఈడీ ఎన్ .పుష్పలత, జిల్లా మైనారిటీస్ అధికారి కృపావరం, సెరీకల్చర్ డిడి శ్రీవాణి, ఎల్డిఎం డి.నీలాద్రి, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి

విశాలాంధ్ర - రాజోలు : ఆకాశాన్ని అంటుతున్న కూరగాయలు, నిత్యవసర వస్తువుల ధరలను తక్షణమే అరికట్టాలని సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేసారు. మలికిపురం మండలం దిండి గ్రామంలో గురువారం దిండి, రామరాజులంక గ్రామాల సీపీఐ పార్టీ గ్రామ శాఖ సమావేశం మేడిచర్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ప్రజలు కరువుతో పస్తులు ఉండే పరిస్థితి నెలకుంది. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలని సీపీఐ నాయకులు కోరారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సీపీఐ 99 సంవత్సరాల పూర్తిచేసుకుని 100వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా డిసెంబర్ 26వ తేదీ నుండి రాజోలు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆవిర్భావ దినోత్సవాలను ఒక పండగ వాతావరణంలో జరపాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మలికిపురం ఏఎఫ్‌డిటి విద్యా సంస్థలను పూర్తిగా ప్రభుత్వ పరం చేసినప్పుడే కాలేజీకి సంబంధించిన సమస్యలు పరిష్కారం అవుతాయని, సిబ్బందికి, విద్యార్థులకు పూర్తి న్యాయం జరుగుతుందని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. రామరాజులంక సిపిఐ శాఖ కార్యదర్శిగా మేడిచర్ల సత్యనారాయణ మరో ఐదుగురు కమిటీ సభ్యులను, దిండి గ్రామ శాఖ కార్యదర్శిగా దేవ రాజబాబు మరో ఐదుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మలికిపురం మండల కార్యదర్శి దేవ సురేష్ బాబు, ఏపుగంటి రామచంద్రరావు, దేవ నాగభూషణం, బత్తుల రవి ప్రసాద్, డి రత్నరాజు, పుల్లెల ఆనంద్, దేవ రాజబాబు, ఏనుగుపల్లి నరసింహమూర్తి, పెద్దిరెడ్డి రామారావు, డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను ఆదుకోవాలి

విశాలాంధ్ర - అమలాపురం : సచివాలయం వలంటీర్స్ అసోసియేషన్ అంబేద్కర్ కోనసీమ అధ్యర్యంలో తెలుగు తల్లికి వందనం కార్యక్రమం అమలాపురం అర్బన్, రూరల్ సచివాలయం వలంటీర్స్ వరదా వెంకటానంద్ నేతృత్వంలో నిర్వహించారని జిల్లా అసోసియేషన్ చైర్మన్ సత్తిబాబు ప్రకటనలో తెలిపారు. సచివాలయం వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గాంధేయ మార్గం అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సచివాలయం వలంటీర్సను ఆదుకోవాలని ఆదిశగా రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ వారు రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆ పిలుపు మేరకు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలు చేయాలని జిల్లా చైర్మన్ సత్తిబాబు 26వ తేదీ ప్రారంభ కార్యక్రమంగా తెలుగు తల్లికి వందనం కార్యక్రమంలో విధుల్లో ఉన్న వాలంటీర్స్ అందరికీ పని అయినా చెప్పండి- తిండి అయినా పెట్టించమ్మ అంటూ అమరజీవి పొట్టి శ్రీరాములు మానస పుత్రిక మా తెలుగు తల్లి అని తెలుగు తల్లిని అభ్యర్థిస్తు తమ ఆకలి బాధలు విన్నవించుకున్నారు. అనంతరం సంఘం జిల్లా చైర్మన్ సత్తిబాబు గాంధీ సెంటర్ (గడియార స్తంభం సెంటరు) వద్ద కలిసుకొని భవిష్యత్తు కార్యా చరణ ప్రణాళిక రూపొందించుటకోసం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించాలని సూచించారని సచివాలయం వాలంటీర్స్ అర్బన్ ఇన్చార్జి ఆనంద్, రూరల్ ఇన్చార్జ్ దేవా పేర్కొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో పేదల భూములు సురక్షితం

విశాలాంధ్ర - ఆలమూరు : జగన్ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో పేదల భూములు సురక్షితంగా ఉంటాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలో గురువారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యానందరావు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ వంద రోజుల పాలనలో పేదల భూముల దోచుకునే విధంగా జగన్ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం ద్వారా ప్రజల ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో దంగేటి చంద్రకళ భాపానియ్యా, మెర్ల సత్యవతి గోపాలస్వామి, నాగిరెడ్డి స్వామి, సూరపురెడ్డి సత్య, బల్ల హరికృష్ణ, మార్గాన సత్తిబాబు గౌడ్, జోంపోలు వెంకటరావు, జోంపోలు నాగేశ్వరరావు, అనుసూరి ఆంజనేయులు, ఆకుల రామకృష్ణ, సుఖమాల రాముడు, సుంకర స్వమన్నా, అన్నవరం, శ్రీరామచంద్రమూర్తి, సుంకర కామరాజు, మద్ది పట్టాభి, మెర్ల శ్రీను, అదేంటి శ్రీను, ఆంజనేయులు, వెన్న భీమశంకరం, పాలకొల్లు రాంబాబు, వెంకన్న, సొమ్ము శ్రీనివాస్, నాగిరెడ్డి మహేష్, నక్క కరుణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్స్, వర్కర్ల పోస్టులకు ఇంటర్వ్యూ

విశాలాంధ్ర - కొవ్వూరు : డివిజన్ పరిధిలోని అంగన్వాడీ హెల్పర్ , వర్కర్ పోస్టులను భర్తీ చేయడంలో భాగంగా గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసినట్టు ఆర్డీవో కృష్ణ నాయక్ తెలిపారు. కొవ్వూరు పట్టణం లోని ఆర్డీవో కార్యాలయంలో కొవ్వూరు డివిజన్ పరిధిలోని గోపాలపురం పెరవలి కొవ్వూరు ప్రాజెక్టులలో ఖాళీ అయిన హెల్పర్స్, వర్కర్ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ కొవ్వూరు డివిజన్ పరిధిలో 30 హెల్పర్ పోస్టు లకు ఒక వర్కర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 106 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కొవ్వూరు ప్రాజెక్టు పరిధిలో 12 పోస్టు లకు 49 మంది దరఖాస్తు, గోపాలపురం ప్రాజెక్టు పరిధిలో ఏడు పోస్టులకు 31 దరఖాస్తులు, పెరవల్లి పరిధిలో 11 పోస్టులకు 24 దరఖాస్తులు , గోపాల పురం ప్రాజెక్టు పరిధిలో ఒక వర్కర్ పోస్టుకు రెండు దరఖాస్తులు చేసుకొన్నారని అన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు చెప్పారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను త్వరలోనే తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ జె సంధ్య, తూర్పుగోదావరి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె విజయకుమారి, కొవ్వూరు సిడిపిఓ డి మమ్మీ, గోపాలపురం సిడిపిఓ కె నాగలక్ష్మి, పెరవలి సిడిపిఓ ఎం శ్రీలక్ష్మి ఏసిడిపిఓయువి పద్మావతి, అంగన్వాడి సూపర్వైజర్లు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తాం

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర-ఏలూరు: చిరు వ్యాపారులు, కుల వృత్తిదారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి చెప్పారు. నూజివీడు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నూజివీడు కోసం అనే ప్రత్యేక కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ,జాతీయ లైఫ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఔత్సాహిక రైతులకు, నిరుద్యోగులకు ప్రోత్సాహం, ప్రభుత్వ రుణాలపై అవగహన సదస్సులో ముఖ్య అతిధిగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్ధిక రుణాలను అంది పుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు చేతి వృత్తులవారు, చిరువ్యాపారస్తులకు అందుబాటులో ఉంచిన అనేక ప్రోత్సాహకరమైన రుణాలపై అవగహన పెంచుకొని ఋణాలను పొందాలన్నారు. తద్వారా వ్యాపారాభివృద్ధి చేసుకొని ఆర్ధికంగా ఎదగాలన్నారు. రుణాలు లబ్ధిపై, వాటిని పొందే విధానంపై లబ్దిదారులకు అవగాహన కల్పిస్తూ బ్యాంకర్స్, వ్యవసాయ, ఇతర సంక్షేమ శాఖ అధికారులు కలిసి ప్రతీ నెల ఒక సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు.రైతులకు, చిరు వ్యాపారులకు ఋణాలను అందించే భాద్యత అధికారులపై ఉందన్నారు. వ్యాపారంలో పోటీ పడాలంటే ఆధునిక టెక్నాలజీ జోడించి వ్యాపారం చేస్తే ఆర్ధిక ఫలాలు లాభాలు అంది

పుచ్చుకోవచ్చన్నారు.గొర్రెలు, మేకలు, మూగ జీవాల ఫామ్స్ నిర్మాణానికి రూ.1 కోటి వరకు ఋణం 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు.దానిని అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిటీ ఋణాలను విస్తృతంగా గ్రామ స్థాయిలోప్రచారం, అవగాహన చేయవలసిన బాధ్యత బ్యాంకర్స్, ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. రైతులు బ్యాంకులకు వెళ్లి తమకు ప్రభుత్వ పరంగా ఆయా పధకాల రుణాల మంజూరుకు ప్రశ్నించే తత్వం మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఏ ఒక్క రైతుకు, చిరు వ్యాపారులకు, బ్యాంకర్స్ ఋణాలు ఇవ్వమని చెప్పిన పక్షంలో తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే బ్యాంకర్స్ తో మాట్లాడి ఋణాలు ఇప్పించే బాధ్యత తనదని మంత్రి స్పష్టం చేశారు. నూజివీడు నియోజకవర్గ ప్రజలు వ్యవసాయంతో పాటు వ్యాపారంలో కూడా ఆర్ధికంగా ఎదగాలనే ఆకాంక్షతో బ్యాంకర్స్ తో మాట్లాడి ప్రత్యేకమైన అవగహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సు లో 400 మంది ఋణాలకు అర్జీ పెట్టుకోగా కనీసం ఈ సదస్సులో మొదటిగా 100 కి ఋణాలు ఇప్పించే బాధ్యత తనదన్నారు. కమ్మరి, కుమ్మరి, చేనేత, నాయీబ్రాహ్మణ, షూమేకర్స్, ఇలా ప్రతీ ఒక్క చేతి వృత్తుల వారికి సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల సబ్సిడీ ఋణాలు అందిస్తున్నాయన్నారు. బ్యాంకర్లు అందించే ఋణాలపై అవగహన కల్పించేందుకు, ఋణాలు పొందేందుకు త్వరలో నూజివీడులోని తమ క్యాంప్ కార్యాలయంలో ఒక ప్రత్యేక ఆఫీసరును నియమిస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, బ్యాంకర్స్, రైతులు, చిరు వ్యాపారులు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం వంద రోజుల పాలనలో చంద్రబాబు ఘనత

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం సంక్షోభంలోను సంక్షేమం వంద రోజుల పాలనలో చంద్రబాబు ఘనత అని మండపేట ఎంఎల్ఏ వేగుళ్ళ జోగేశ్వరావు అన్నారు. కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రసంగించారు. గత సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు మూడు వేలుగ వున్న సామాజిక పెన్షన్‌ను ఒకే సారి నాలుగు వేలుకి పెంచి ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలచే మన్ననలు పొందారని వేగుళ్ళ కొనియాడారు. ఈ నెల 1వ తేదీన బుడమేరు వాగు ఉధృతికి విజయవాడ నగరం ముంపుకి గురయితే సీఎం చంద్రబాబు స్వయంగా పది రోజులపాటు క్షేత్ర స్థాయిలో రేయి పగలు పర్యటించి బాధితులకు సహాయ సహకారాలు అందించారన్నారు. వచ్చే దీపావళికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు హామీ నెరవేర్చే దిశగా ఎన్‌డిఏ కూటమి అడుగులు వేస్తుందని ఎంఎల్ఏ తెలిపారు. అలాగే దశలు వారిగా ఎన్నికల హామీలు నెరవేరుస్తారని వేగుళ్ల భరోసా ఇచ్చారు. 2014 అక్టోబర్ 4వ, తేదీని మా ఊరు జన్మ భూమి కార్యక్రమాన్ని నాటి సీఎం చంద్రబాబు అంగర గ్రామంలో ప్రారంభించి, గ్రామ అభివృద్ధికి ఏడు కోట్లు నిధులు మంజూరు చేశారని వేగుళ్ళ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, రెడ్డి ప్రసాద్, పువ్వల చిట్టి బాబు, వైస్ ప్రెసిడెంట్ యర్రా వీరన్న బాబు, ఎన్ రాంజీ, చుండ్రు రాంబాబు, షేక్ కరీం, కొప్పిసెట్టి వాసు, ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ చిన్నారావ్, ఐకేపీ ఏపి ఎమ్ దుర్గాప్రసాద్, మండల వ్యవసాయ అధికారి రమేష్ కుమార్, స్థానిక సంస్థల ప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, అధిక సంఖ్యలో టీడీపి, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జనసేనలో బీసీలకు పెద్దపీట

- సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే పంతంలకు కృతజ్ఞత తెలిపిన ఈశ్వరి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్ సభ్యురాలుగా కాకినాడరూరల్ రమణయ్య పేట ఒకటవ డివిజన్‌కు చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకురాలు కడలి ఈశ్వరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా కడలి

ఈశ్వరి తన నివాసం వద్ద, పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మీడియాతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తరఫున నాకు ఈ అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కళ్యాణ్, బిజెపి నాయకులకు, అలాగే ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ సభ్యురాలిగా ఒక బీసీ శెట్టిబలిజ కులానికి చెందిన నాకు పెద్దపీట వేసి అవకాశం కల్పించటం పట్ల చాలా సంతోషంగా ఉందని జనసేన పార్టీని నమ్ముకుని కష్టపడి పని చేసిన వాళ్లకు గుర్తింపు ఉంటాది అనటానికి ఇది నిదర్శనం అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో జనసేన యువనాయకులు కడలి శివ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాక్షస పాలన పోయి రామరాజ్యం వచ్చింది : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : వందరోజుల కూటమి సుపరిపాలనలో ప్రజాసంక్షేమ యజ్ఞం నిరాటంకంగా కొనసాగిందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన పోయి, రామరాజ్యం వచ్చిందనే ఆనందం ప్రజల నుండే వ్యక్తమవుతోందని, దీంతో ఇది మంచి ప్రభుత్వమని కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలే ప్రస్తుతిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఏలూరులో ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటి ముఖ్య అతిధిగా పాల్గొని, ప్రజలతో మమేకమవుతూ నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. గురువారం ఏలూరు 2వ డివిజన్ భూలోకమ్మ తల్లి గుడివద్ద నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్‌లకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. భూలోకమ్మ తల్లిని దర్శించుకున్న తర్వాత ప్రతి ఇంటికి వెళ్ళిన వారు వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం సాగించిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ప్రతి ఇంటికి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ బావిశెట్టివారి పేట అంటే బడేటి కోటని అభివర్ణించారు. ఇక్కడ తొలి నుంచి తనకు పూర్తి సహకారం లభిస్తోందన్న ఎమ్మెల్యే,, స్థానిక సమస్యల పరిష్కారానికి కూడా అదేస్థాయిలో కృషిచేశానని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన పోయి రామరాజ్యం వచ్చిందని, ప్రజా ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వానికి వందరోజుల పాలనే గీటురాయని అన్నారు. అలాగే డిడిలు కట్టిన వారందరికీ టిడ్కో ఇళ్ళు ఇచ్చేందుకు కృషి చేస్తామన్న ఎమ్మెల్యే దీపావళితో ప్రతి గృహంలో ఉచిత గ్యాస్ వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టామన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ నగరాభివృద్ధికి ఎమ్మెల్యే బడేటి చంటి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్ లో అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు ఎస్.కె మీరా, టీడీపీ నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన అధ్యక్షులు నగిరెడ్డి కాశీనరేష్, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, నాయకులు ఉప్పాల జగదీష్ బాబు, ఎస్ఎంఆర్ పెదబాబు, బొద్దాని శ్రీనివాస్, ఎంఆర్డీ బలరాం, కార్పొరేటర్ జున్నూరు కనక నరసింహారావు, మేకల సీతారామయ్య, భావిశెట్టి నందకుమార్, నిమ్మల శ్రీనివాసరావు, నాగులపల్లి గంగాధరరావు, సంకబత్తుల నాగరాజు, గుండు శివాజీ, లంకలపల్లి సతీష్, వెంపల అనిల్, వాళ్ళ శ్రీనివాసరావు, పప్పు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి గేమ్స్‌కి విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - గణపవరం: ఎస్ జి ఎఫ్ స్కూల్ గేమ్స్ ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి పోటీలు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ కైకరం నందు గురువారం జరిగిన పోటీలలో గణపవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి విద్యార్థి అండర్ -17 విభాగంలో వాలీబాల్ కి భానుచరణ్, గోకుల్ కృష్ణ పదవ తరగతి, హై జంప్ కు అఖిల్ శ్రీ వర్మ ఎనిమిదవ తరగతి అండర్- 14 వాలీబాల్ కి, అండర్ 14 కబడ్డీ కి 9వ తరగతి పవన్ సెస్ పోటీలకు మహేష్ మూడు కిలోమీటర్లు పరుగు పందానికి టెన్త్ విద్యార్థి యశ్వంత్, 15 మీటర్లు పందానికి సురేష్ జిల్లా స్థాయికి ఎంపిక అయినట్లు హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం పద్మావతి తెలిపారు.

మంత్రి పార్థసారధిని కలిసిన జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలక్ష్మి

విశాలాంధ్ర-ఏలూరు: పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గా నియమితులైన వి. శ్రీలక్ష్మి గురువారం రెవిన్యూ అతిధి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధికి పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాలన్నారు. గోనెసంచులు, రవాణా వాహనాలు,తదితర సమస్యలు తలెత్తకుండా ధాన్యం సేకరించాలని, తేమ శాతం లెక్కింపు, ధాన్యం సేకరణ, తదితర అంశాలలో సిబ్బందికి శిక్షణ అందించి ధాన్యం సేకరణ ప్రక్రియను నిర్వహించాలని శ్రీలక్ష్మిని మంత్రి ఆదేశించారు.

రేపు అమలాపురంలో గరికిపాటి ప్రవచనం

విశాలాంధ్ర - అమలాపురం : ప్రముఖ ప్రవచన కారులు, మహా సహస్రావధాని, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం ఈనెల 28వ తేదీన అమలాపురంలో నిర్వహిస్తున్నట్లు ఆనందు ధార్మిక సంస్థల నిర్వాహకులు అయ్యల సోమయాజుల బ్రహ్మానందం తెలిపారు. అమలాపురం పట్టణంలోని లక్ష్మి జానకి రామర్స్ కళ్యాణ మంటపం నందు శనివారం సాయంత్రం 6 గంటలకు గరికిపాటి నరసింహారావు ప్రవచనం ఉంటుందని ఆయన చెప్పారు. శ్రీమద్భగవద్గీతలో అంతర్గతమైన నవమ స్కందంలోని అంబారీషోపాఖ్యానం పై గరికపాటి నరసింహారావు ప్రవచనం చెబుతారని బ్రహ్మానందం చెప్పారు. హిందూ ధార్మిక బంధువులు అందరూ ఈ ప్రవచనం కార్యక్రమంలో పాల్గొనాలని ఆనందు ధార్మిక సంస్థల నిర్వహకులు అయ్యల సోమయాజుల బ్రహ్మానందం కోరారు.

పౌష్టికాహారంతోనే వ్యాధులు దూరం

మెప్మా ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

విశాలాంధ్ర - సామర్లకోట : పౌష్టికాహారంతోనే వ్యాధులు దూరమ వుతాయని, రక్తహీనత లోపాన్ని నివారించుకోవచ్చని జిల్లా హెల్త్, న్యూట్రిషన్ స్పెషల్ అధికారిని జ్యోతి, సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య అన్నారు. సామర్లకోట పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాలను మెప్మా టిపిఎమ్ సుజాత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్, న్యూట్రిషన్ అధికారిని జ్యోతి, మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ పౌష్టికాహారంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి పువ్వులు, పండ్లు వంటి పౌష్టికాహారం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సిఆర్పిలు తయారు చేసిన వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించగా మున్సిపల్ కమిషనర్ మరియు స్పెషల్ ఆఫీసర్ పరిశీలించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లిలో పొలంబడి కార్యక్రమం

విశాలాంధ్ర-గండేపల్లి : గండేపల్లి గ్రామంలో గురువారం మంచి వ్యవసాయ పద్ధతులు-పొలంబడి కార్యక్ర మాన్ని మండల వ్యవ సాయ అధికారి సద్గురు మూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ మరియు వర్షంతో కూడిన వర్షం రీత్యా ఆకు ఎండు తెగులు ఉధ్రుతి ఎక్కువగా ఉందని మరీ ఎక్కువగా నీడ ఉన్న ప్రాంతంలో ఇది ఎక్కువని తెలిపారు. దీని నివారణకు నీరు తీసి పెట్టుకొని పై పాటుగా 20 కేజీలు పొటాష్ వేసుకోవాలి అని సూచించారు. అలాగే 1కేజీ సూడోమోనాస్ 100 లీటర్ల నీటిలో కలిపి చల్లడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయి అని అయితే ఈ సూడోమోనాస్ చల్లినప్పుడు వారం వరకు ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు, తెగులు మందులు వాడరాదని చెప్పారు అలాగే ఖరీఫ్-2024 ఈ-పంట నమోదు మరియు ఈ-కేవైసీ నమోదుకు ప్రభుత్వం ఈనెల 30 వరకు గడువు పెంచిందని కావున అర్హత గల వారు త్వరితగతిన సంబంధిత రైతు సేవా కేంద్రం వద్ద సంప్రదించాలి అని చెప్పారు.ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కరరావు, రమ్య, విఏఏ అంజలి, రైతులు పాల్గొన్నారు.

డా ఉమర్ ఆలీషాచే "నా మొక్క నా శ్వాస"

విశాలాంధ్ర - కాకినాడ : "నా మొక్క నా శ్వాస" కార్యక్రమం ద్వారా పిఠాపురం పట్టణాన్ని నందనవనంగా మార్చి, అనారోగ్యాలు తొలగించుకోమని పీఠాధిపతి డా ఉమర్ ఆలీషా స్వామి అనుగ్రహ భాషణ చేశారు. గురువారం ఉదయం పిఠాపురం రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రైల్వే స్టేషన్ మాస్టర్ పి నాగ బాబు అధ్యక్షత వహించగా, విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం, పీఠాధిపతి డా ఉమర్ ఆలీషా స్వామి ముఖ్య అతిథిగా, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్ కనకారావు, రీజనల్ బయో డైవర్సిటీ కో ఆడినేటర్ సత్య ప్రసాద్, రైల్వే యూనియన్ చైర్మన్ టి ఈశ్వరరావు, పివే బి జనార్ధన రావు, గురువు సోదరుడు అహ్మద్ ఆలీషాలు అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. పీఠాధిపతి డా ఉమర్ ఆలీషా మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా జీవ వైవిధ్యంను కాపాడాలని మరియు అనేక ఆనారోగ్యసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ మూడు మొక్కలు నాటి బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరుపంగా మొక్కలు పెంచి, పిఠాపురం పట్టణాన్ని హరిత వనంగా చేసి, స్వచ్ఛమైన ఆక్సిజన్ పొందాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా ఆత్మీయ, స్నేహాభావం మనందరికి కలుగుతుందని, ప్రతీ రోజు మొక్క సంరక్షణ చూసుకోవాలని పిస్తుందన్నారు. మన పూర్వీకులు మొక్కలను నాటడానికి అధిక ప్రధాన్యత ఇచ్చేవారని కనుకనే నేడు భారి వృక్షాలను మనం చూస్తున్నామని గుర్తుచేసారు. మున్సిపల్ కమిషనర్ కనక రావు మాట్లాడుతూ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో,డివిజన్ ఫారెస్ట్ అధికారుల పర్యవేక్షణలో పిఠాపురం పురపాలక సంఘం మొక్కలకు రక్షణగా ట్రీ గార్డ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. స్టేషన్ మాస్టర్ నాగ బాబు మాట్లాడుతూ రైల్వే స్టేషన్ ఆవరణ అంతా హరిత వనంగా తీర్చి దిద్దుటకు సంకల్పించిన పీఠాధిపతి డా ఉమర్ ఆలీషాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఆధ్యాత్మిక రుషిగా పేరొందిన స్వామిజీ ఆధ్వర్యంలో ఇటువంటి నామొక్క నాశ్వాస కార్యక్రమం ద్వారా మొక్కలు నాటడం వల్ల అటు ప్రజలకు యిటు ప్రయాణీకులకు ఎంతో మేలు చేస్తున్నారని, ఈ ప్రాజెక్టు విజయంతానికి ప్రతీ ఒక్కరూ తప్పక కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, కౌన్సిలర్ నగేష & శివరామకృష్ణ, ఎన్టివి ప్రసాద వర్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పీఠంలో శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



విశాలాంధ్ర - పెద్దాపురం : స్థానిక వర్షుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో దేవి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లును ముమ్మరం చేశారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్దాంతి ఆధ్వర్యంలో శరన్నవ రాత్రి ఉత్సవాల ఏర్పాట్లుకు సన్నహాలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వచ్చే నెలా మూడవ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 28వ తేదీన రాట మూహూర్తం చేయనున్నామన్నారు. ఉదయం 9.23 నిమిషాలకు వేముల సత్యసాయి ప్రసాద్, అరుణ దంపతులనచే రాట ముహూ ర్తం ఉంటుందన్నారు. గత 25 ఏళ్లుగా భువనేశ్వరి పీఠంలో దేవి నవరాత్రులు నిర్వహి ంచడం జరుగుతుందన్నారు. నవరాత్రుల్లో అమ్మవారికి ప్రతీ రోజూ అభిషేక, సహస్ర నామ కుంకుమ పూజలు, ఛండీపారాయణం, హోమం నిర్వహించడం జరుగుతుంద న్నారు ప్రత్యక్ష, పరోక్ష పద్దతిలో అమ్మవారికి పూజలుంటాయని, పూజల్లో పాల్గొనే భక్తులు 9866193557, 8897554557 నెంబర్లుకు సంప్రదించాలని కోరారు. దేవి మాల ధరించుకునే భక్తులు ముందుగా సంప్రందించాలని ఆయన కోరారు.

తిరుపతి లడ్డు దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - యానాం : యానాంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డును అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, పలువురు భక్తులు డిమాండ్ చేశారు. లడ్డూలు అపవిత్రం చేసిన దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించి అనంతరం ర్యాలీని ప్రారంభించారు. సేవకులు, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వినాయకుని ఊరేగింపు

విశాలాంధ్ర- పెరవలి : గణపతి ఉత్సవాలలో భాగంగా గురువారం మండలంలో గల కాకరపర్రు గ్రామంలో వినాకని ఊరేగింపు కార్యక్ర మం ఎంతో వైభవనగా నిర్వహించారు.వినాయకుణ్ణి ఊరేగించే వాహ నానికి సుమారు 2 లక్షల రూపాయల ఖర్చుతో పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేసినట్లుగా పలువురు తెలిపారు ఈఅలంకరణ చూపరు లను ఆకర్షించింది. బాజా భజంత్రీలు మేళతాళాలు డిజే చప్పుల్లు ప్రత్యేక వేష దారణలు కేరళా నృత్యాలతో ఊరేగింపు కార్యక్రమం జరిగింది.పెద్ద ఎత్తున ప్రజలు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

తప్పుకి ప్రాయశ్చిత్తం కొంత మినహాయింపు ఇస్తుంది

భాజపా నియోజకవర్గ కన్వీనర్ వీరన్న చౌదరి

విశాలాంధ్ర-సీతానగరం: తప్పుకి ప్రాయశ్చిత్తం కొంత మినహా యింపు ఇస్తుందని భాజపా నియోజకవర్గ కన్వీనర్ వీరన్న చౌదరి అన్నారు. వీరన్న చౌదరి విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల శాసనసభ్యులు శ్రీ జగన్ మోహన్ రెడ్డి గారు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనే నిర్ణయం చాలా మంచిది. చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం కొంత మినహాయింపు ఇస్తుందని అన్నారు. అయితే జగన్ మోహన్ రెడ్డికి నమ్మకం లేని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సమక్షంలో కాకుండా వారు నమ్మి ప్రార్థించే ప్రభువు సన్నిధిలో ప్రాయశ్చిత్తం చేసుకోవాలని నా అభ్యర్థన లేదా తిరుమలలో నే చెయ్యాలని నిర్ణయించుకుంటే వారు సతీ సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి మీద భక్తి విశ్వాసాలు ఉన్నవి" అని అంగీకరిస్తూ సంబంధించిన పత్రాల మీద ఇరువురూ సంతకం చేయాలని అన్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వామి వారి సమక్షంలో భక్తులకి సంతృప్తి కలిగే విధంగా స్వీకరించాలని ఒక సాధారణ హిందువుగా నా మనవి, నా అభ్యర్థన అని అన్నారు.

బ్రహ్మాజీ కుటుంబ సభ్యులను పరామర్శించిన రాంజీ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన రామకుర్తి బ్రహ్మాజీ తల్లి ఇటీవల మృతి చెందారు. జగ్గంపేట వైఎస్ఆర్సిపి ఇన్చార్జి, మాజీ మంత్రివర్యులు, మాజీ ఎంపీ తోట నరసింహం తనయుడు రాంజీ గురువారం బ్రహ్మాజీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, రామకుర్తి శ్రీరామచంద్ర మూర్తి, మద్దిపట్ల రామకృష్ణ, తాళ్లూరి మధు కుమార్, పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శివారు ఉన్న కార్తికేయ హాస్పిటల్ మూడో వార్షికోత్సవ సందర్భంగా గురువారం హాస్పిటల్‌లో జగ్గంపేట పరిసర ప్రాంతావాసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో సుమారు 200 మంది పైగా హాజరై ఉచితంగా వైద్యం పొందారు. హాస్పటల్ వైద్యులు డాక్టర్ కెవిఎస్ఎన్ అవినాష్ ఎండి (జనరల్ మెడిసిన్) మాట్లాడుతూ పట్టణాలకు దీటుగా జగ్గంపేట వంటి ప్రాంతంలో అత్యాధునిక పరికరాలతో ఉత్తమ వైద్య సేవలను అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కార్తికేయ హాస్పిటల్ నందు ఎన్టీఆర్ వైద్య సేవల సదుపాయం ఉందన్నారు.